శుక్రవారం
10-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 347
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పొరుగు దేశాల భద్రత ముఖ్యం: చైనా

కొరియన్ ద్వీపకల్ప సమస్యలను పరిష్కరించడానికి పొరుగు దేశాల భద్రతా ప్రయోజనాలను సమర్థించడం అవసరమని చైనా రాయబారి జాంగ్ జున్ పేర్కొన్నారు. కొరియా ద్వీపకల్ప సమస్యలపై యుఎన్ జనరల్ అసెంబ్లీ చర్చలో జాంగ్ మాట్లాడుతూ ఈ చర్యలు అణ్వస్త్ర వ్యాప్తి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో కూటమి ఘర్షణలకు దారి తీయడం ఏ దేశానికి మంచిది కాదన్నారు.

2 లో

మోదీ సర్కార్ నిర్ణయాలన్నీ
ఏకపక్షమే

సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెట్టేసే యత్నం

- సెక్షన్ 66 ఎ పునరుద్ధరణకు కసరత్తు
- సైబర్ నేరాల నిరోధక చట్టం పేరుతో తిరిగి అమలుకు యోచన
- ఐరాసకు ప్రతిపాదనలు
- కొనసాగుతున్న చర్చలు

న్యూఢిల్లీ : దేశ సర్వోన్నత న్యాయస్థానం ఏడేళ్ల కిందట కొట్టివేసిన చట్టాన్ని తిరిగి అమల్లోకి తేవాలని మోదీ ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఐటీ చట్టంలోని తొలగిత సెక్షన్ 66 ఎను వాడుకలోకి తేవాలని దొడ్డిదార్లు వెతుకుతోంది. సైబర్ నేరాలను నిరోధించే క్రమంలో ఐరాసతో జరిగే ఒప్పందాన్ని ఆసరాగా పెట్టుకొని అనుకున్నది సాధించాలని భావిస్తోంది. ఇదే క్రమంలో ఆ సెక్షన్ కింద అన్ని విషయాలను యథావిధిగా ఉంచి ఐరాసకు ప్రతిపాదనలు పంపింది. అనుచిత సందేశాలను నేరంగా పరిగణించడం, సైబర్ నేరాలను కట్టడి చేయడం కోసం న్యాయమైన ఒప్పందాన్ని ఐరాసతో కుదుర్చుకునే ప్రయత్నాన్ని భారత్ చేస్తోంది. ఇందుకోసం చర్చలు జరుపుతోంది. తాజా ప్రతిపాదనలు గతంలో సుప్రీంకోర్టు కొట్టివేసిన సెక్షన్ 66ఎకు నకలుగా ఉన్నాయి. అందులోని ప్రతి వ్యాఖ్యను మక్కీమక్కి కొత్తగా రాసినట్లుగా ఉంది. అప్పట్లో ఈ సెక్షన్‌ను దేశంలోని కార్టూనిస్టులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులపై కేసుల నమోదుకు వాడారు.

రాజ్యాంగబద్ధంగా లేదంటూ సుప్రీంకోర్టు ఆ సెక్షన్‌ను తొలగించింది. ఐరాసకు పంపిన ప్రతిపాదనపై విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు స్పందించలేదుగానీ ఐరాస ఆమోదం లభిస్తే మరోమారు 66ఎ ఆంక్షలను అమలు చేయొచ్చు అని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ది

- మిగతా 2 లో

'ముందస్తు' తప్పదా !

- వైసీపీ వర్క్‌షాపులో సీఎం సంకేతాలు
- నిత్యం ప్రజల్లోనే ఉండాలని ఎమ్మెల్యేలకు ఆదేశం
- నేతల పనితీరుపై ప్రతినెలా సమీక్ష
- నివేదిక ఆధారంగానే టికెట్లు ఉంటాయని స్పష్టీకరణ
- అధికారపార్టీలో మొదలైన అలజడి

2 లో

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు అనివార్యమని స్పష్టమవుతోంది. పరిమితికి మించి అప్పులు చేయడం, సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం, ప్రతి నెలా జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న ఆలోచనలో సీఎం జగన్ ఉన్నట్లు తెలుస్తోంది.

రూ.3,19,480 కోట్ల రుణాలు

- వ్యవసాయ రంగానికి 51.56శాతం
- ప్రాథమిక రంగానికి 73.76శాతం
- ఎస్ఎల్‌బీసీ వార్షిక రుణ ప్రణాళిక విడుదల
- విద్య, గృహ రుణాలు పెంచాలని సీఎం జగన్ సూచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ.3,19,480 కోట్లతో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన గురువారం క్యాంపు కార్యాలయంలో జరిగిన 219వ ఎస్ఎల్‌బీసీ సమావేశం 2022-23 వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించింది. మొత్తం రుణాల అంచనాల్లో 51.56శాతం వ్యవసాయ రంగానికి (రూ.1,64,740కోట్లు), మొత్తంగా ప్రాథమిక రంగానికి 73.76శాతం (రూ. 2,35,680 కోట్లు) ఇవ్వాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ కోవిడ్ ప్రభావం తగ్గుతున్నందున తిరిగి ఆర్థిక వ్యవస్థ కోలుకునే సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయన్నారు. 2021-22లో దేశ జీడీపీ రూ.237 లక్షల కోట్లు కాగా, ప్రస్తుత ధరల సూచీ ప్రకారం జీడీపీ వృద్ధి అంచనా 19.5శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం 7.79శాతానికి చేరిందని కేంద్ర గణాంకాలశాఖ వివరాలు వెల్లడించింది. 8 ఏళ్ల వ్యవధిలో ఇదే అత్యధికం. గ్రామీణ ప్రాంతాల్లోనూ ద్రవ్యోల్బణం అత్యధికంగా 8.38శాతం ఉండడం

- మిగతా 2 లో

ఆలస్యంలేదు
రెండ్రోజుల్లో వానలే వానలు

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలు సాధారణంగానే పురోగమిస్తున్నాయి... రాబోయే రెండు రోజుల్లో మహారాష్ట్రను తాకుతాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. మే 31- జూన్-7 మధ్య దక్షిణ, మధ్య అరేబియా మహాసముద్రం, కేరళ మొత్తం సహా కర్ణాటక, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు ప్రవేశించాయని ఐఎండీ సీనియర్‌శాస్త్రవేత్త ఆర్కే జెనామణి తెలిపారు. ఇదే సమయంలో ఈశాన్య భారతదేశం మొత్తం మంచి వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. 'రుతుపవనాల రాకలో ఎలాంటి జాప్యం లేదు. రాబోయే రెండు రోజుల్లో మహారాష్ట్రలోకి ప్రవేశిస్తాయి. తర్వాత రెండు రోజుల్లో ముంబైలోనూ

- మిగతా 2 లో

ఎర్రచందనం కేసుల విచారణకు
రెండు ప్రత్యేక కోర్టులు

ప్రారంభించిన సీజేఐ రమణ

విశాలాంధ్ర-తిరుపతి: ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణ కోసం రెండు ప్రత్యేకకోర్టులు తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. ఎస్‌వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో సీజేఐ ఎన్‌వీ రమణకు గురువారం అభినందన కార్యక్రమం జరిగింది. జస్టిస్ రమణ మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మహాభాగ్యంగా భావిస్తానన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడి కోసం ప్రత్యేక న్యాయస్థానాలు ప్రారంభించడానికి తనను ఆహ్వానించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఎర్రచందనానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. దశాబ్దాలుగా దీనిని స్మగ్లర్లు విదేశాలకు ఎగుమతి చేస్తూ అక్రమార్జనకు అలవాటు పడ్డారని చెప్పారు. పర్యావరణానికీ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. చట్టంలో బలహీనతలు, పటిష్ఠ న్యాయవ్యవస్థ లేకపోవడం, తక్కువ శిక్షలతో బయటపడతామనే ఉద్దేశంతో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ప్రభుత్వం అటవీ పర్యావరణ చట్టాన్ని సవరించి శిక్షలను పదేళ్ల జైలు, లక్ష జరిమానా చేసినా అక్రమాలు ఆగడం లేదని జస్టిస్ రమణ పేర్కొన్నారు. ఈ కేసులకు సంబంధించి ఇంకా కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రత్యేకకోర్టులు లేకపోవడంతో సత్వర విచారణ జరగడం లేదన్నారు. ఈ కోర్టులు విచారణ జరిపి నేరస్తులకు శిక్ష పడేలా నిర్ణయాలు తీసుకుంటాయని ఆశిస్తున్నానన్నారు. కేసులు ఎక్కువగా ఉన్నందున మరో జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. కోర్టుల్లో మౌలిక సదుపాయాల కోసం నిధులు పెంచాలని, కోర్టు అధికారులు, సిబ్బందిని పెంచాలని సూచించారు. తుడా కాంప్లెక్స్‌లో తక్కువ అద్దెకు కోర్టుల ఏర్పాటుకు సహకరించిన చంద్రగిరి శాసనసభ్యులు

- మిగతా 2 లో

జులై 18న రాష్ట్రపతి ఎన్నిక

21న ఓట్ల లెక్కింపు
ఈ నెల15న నోటిఫికేషన్

న్యూఢిల్లీ : తదుపరి రాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధమైంది. జులై 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈనెల 15న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ తర్వాత నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చు అని గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్ అన్నారు. జూన్ 30న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, వాటి ఉపసంహరణకు జులై 2వ తేదీ వరకు గడువు ఉంటుందని చెప్పారు. ఓటింగ్ జులై 18న, ఓట్ల లెక్కింపు 21వ తేదీన ఉంటుందన్నారు. 776 మంది ఎంపీలు, 4,033 మంది ఎమ్మెల్యేలలో కలిపి మొత్తం 4,809 మంది ఓటింగ్‌లో పాల్గొని నూతన రాష్ట్రపతిని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. 'రాష్ట్రపతి ఎన్నికలు పార్లమెంటులో, అసెంబ్లీల్లో జరుగుతాయి. రాజ్యసభ సెక్రటరీ జనరల్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. ఎంపీలు పార్లమెంటులో, ఎమ్మెల్యేలు తమ రాష్ట్రాల అసెంబ్లీల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. అత్యవసర పరిస్థితులు ఏమైనా ఉంటే పోలింగ్ తేదీకి పది రోజులు ముందే ఈసీకి సమాచారం ఇవ్వాలి' అని కుమార్ చెప్పారు. రాష్ట్రపతి ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని, కోవిడ్ ప్రోటోకాల్‌ను ఓటింగ్, కౌంటింగ్ సమయాల్లో పాటిస్తామని, ఈ విషయంలో ఏదేని రాజకీయ పార్టీ విప్ జారీ చేసేందుకు వీల్లేదని సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టంచేశారు. కాగా, ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పదవీకాలం జులై 24తో ముగియనుంది. కాబట్టి ఆ తేదీ కంటే ముందే కొత్త రాష్ట్రపతి ఎన్నిక జరగాల్సిఉంది.

ఇదీ లోకం!

వల్లభుడి ఆదాయం...
కైంకర్యాయ స్వాహా

భగవంతునికి పూజ చేసిన తరువాత నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. అది ఏ రూపంలో అయినా కావచ్చు. అంతమాత్రం చేత భగవంతుడు వచ్చి నైవేద్యాన్ని తినేస్తాడని కాదు. చివరికి అది భక్తుడి పొట్టలోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం 'నైవేద్యం' విషయమేమంటే.. శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, ఉద్దానం సముద్ర తీరప్రాంతంలో వల్లభ నారాయణస్వామి ఆలయం ఉంది. ఇందులో కూడా అంతే... పెట్టిన 'నైవేద్యం' భక్తులకు కాకుండా... డబ్బు రూపంలో నిర్వాహకులకు వెళుతోంది. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ పట్టనట్టు వ్యవహరిస్తోంది.



వల్లభనారాయణస్వామి ఆలయం

విశాలాంధ్ర-మందస: శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, ఉద్దానం వద్ద, రట్టి సముద్ర తీర ప్రాంతంలోని వల్లభనారాయణస్వామి ఆలయానికి ఆదాయం, ఆస్తులు ఉన్నప్పటికీ ఆలయం అభివృద్ధి మాత్రం శూన్యం. దేవాలయానికి వచ్చే ఆదాయాన్ని కైంకర్యం చేస్తుండడంతో అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. మందస జమిందారుల పాలనలో 200 ఏళ్ల క్రితం ఈ ఆలయాన్ని రాజులు నిర్మించారు. దీనికి సుమారు 100 ఎకరాల భూములు ఉన్నాయి. జీడి, కొబ్బరి తోటలతో పాటు రెండు పంటల పండే వరి పొలాలు కూడా ఉన్నాయి. పంటలు దిగుబడి బాగానే ఉంటుంది. ఈ 100 ఎకరాల్లో ఐదు ఎకరాలు మాత్రమే ఆలయ అర్చకులకు ఆదాయం నిమిత్తం దేవాదాయ శాఖ ఉద్యోగులు చూపించి అప్పగించారు. మిగతా భూములన్నీ పెద్ద పెద్ద బడా రైతుల, భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్నాయి. వీరి ఆక్రమణలో ఉన్న భూముల్లో ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. ఈ భూములు అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా బడా రైతు, భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్నాయని తెలిసినా, దేవదాయశాఖ నిమ్మకు నీరెత్తినట్టు ఉంటోంది. అసలు వారి నుంచి ఆదాయాన్ని వసూలు చేస్తున్నారో లేదో కూడా

- మిగతా 2 లో

పొరుగు దేశాల భద్రత ముఖ్యం: చైనా



ఐక్యరాజ్యసమితి : కొరియన్ ద్వీపకల్ప సమస్యలను పరిష్కరించడానికి పొరుగు దేశాల భద్రతా ప్రయోజనాలను సమర్థించడం అవసరమని చైనా రాయబారి జాంగ్ జున్ పేర్కొన్నారు. కొరియా ద్వీపకల్ప సమస్యలపై యుఎన్ జనరల్ అసెంబ్లీ చర్చలో జుంగ్ మాట్లాడుతూ ఈ చర్యలు అణ్వస్త్ర వ్యాప్తి ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో కూటమి ఘర్షణలకు దారి తీయడం ఏ దేశానికి మంచిది కాదన్నారు. ప్రాంతీయ శాంతి, భద్రతకు మొదటి స్థానం ఇవ్వాలని, రాజకీయ వ్యూహాలను ఆపాలని జున్ పిలుపునిచ్చారు. అమెరికా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో కవ్వింపుచర్యలకు పాల్పడుతోందని, ఆ ప్రాంతంలోని సంబంధిత దేశాలతో అణు జలాంతర్గామి, హైపర్‌సోనిక్ ఆయుధాలను అభివృద్ధి చేస్తోందని, అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల క్రూయిజ్ క్షిపణులను విక్రయించడం సరికాదన్నారు. కొరియాలో శాంతి, స్థిరత్వం బాహ్య వాతావరణంతో సంబంధం కలిగిఉన్నాయని ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి జుంగ్ పేర్కొన్నారు. అమెరికా ఇండో-పసిఫిక్ వ్యూహాన్ని అమలు చేస్తోందని, ప్రాంతీయ దేశాలతో సైనిక పొత్తులను బలోపేతం చేస్తోంది తద్వారా ఈ ప్రాంతంలో సైనిక ఘర్షణ ప్రమాదాలను తీవ్రతరం చేస్తోందని తెలిపారు. కొరియన్ ద్వీపకల్ప సమస్యను ప్రాథమికంగా పరిష్కరించడానికి రాజకీయ పరిష్కారం, సంప్రదింపులు అవసరం అని జాంగ్ సూచించారు.

టర్కీతో మరింత సహకారం: మదురో

అంకారా : టర్కీ, వెనిజులా దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, వెనిజులా అధ్యక్షుడు మదురో పిలుపునిచ్చారు. వెనిజులా, టర్కీల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, ఇంధనం, మైనింగ్, నిర్మాణ వ్యాపారం, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యాటక రంగాలలో విస్తృత సహకార సామర్థ్యం ఉందని ఎర్డోగాన్ రాజధాని అంకారాలో మదురోతో సంయుక్త విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. రెండు ఆర్థిక వ్యవస్థలు నూతన సహకారం, పరస్పర పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. టర్కీ, వెనిజులాల మధ్య వాణిజ్యం 2021లో 850 మిలియన్ యుఎస్ డాలర్లకు పెరిగింది. ఈ సంవత్సరం 1 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని వీలైనంత త్వరగా ఏటా 3 బిలియన్ డాలర్లను లక్ష్యంగా చేసుకోవాలని ఎర్డోగాన్ సంకల్పించారు. వెనిజులాను "స్నేహపూర్వక దేశం"గా పేర్కొన్న ఎర్డొగాన్ వెనిజులాపై అమెరికా ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకించారు. వెనిజులాకు టర్కీ అండగా నిలుస్తుందని అన్నారు. మదురో తమ దేశ ప్రజల తరపున టర్కీకి కృతజ్ఞతలు తెలిపారు. అనిశ్చితి సమయాల్లో, అత్యంత కష్టతరమైన మహమ్మారి సమయంలో, టర్కీ ఎల్లప్పుడూ మాకు మద్దతుగా ఉంది" అని వెనిజులా అధ్యక్షుడు అన్నారు. వెనిజులా పర్యాటకం, గనులు, పరిశ్రమలు, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, చమురు, బంగారం, బొగ్గు రంగాలలోకి టర్కీ నుండి పెట్టుబడిదారులను ఆహ్వానించారు. వారికి అన్ని చట్టపరమైన, రాజకీయ హామీలను ఇచ్చారు.

బలమైన కార్మిక పోరాటాలు: నెదర్లాండ్స్ సీపీ

ఆమ్‌స్టర్‌డామ్: కార్మికవర్గ ప్రయోజనాల కోసం, తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని న్యూ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నెదర్లాండ్స్ (ఎన్‌సీపీఎన్) పేర్కొంది. పార్టీ 7వ కాంగ్రెస్ నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌లో జరిగింది. మే14, 21 శనివారాల్లో జరిగిన ఎన్‌సీపీఎన్ కాంగ్రెస్ తీసుకున్న కొత్త నిర్ణయాలతో రానున్న సంవత్సరాల్లో తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేసేందుకు, పార్టీ నిర్ణయాత్మకంగా వృద్ధి చేందేందుకు కృషి చేస్తుందని పేర్కొంది. క్షేత్రస్థాయి సమస్యలను సంబంధిత సభ్యులతో చర్చించారు. కాంగ్రెస్ నుంచి అవుట్‌గోయింగ్ సభ్యుడు జాబ్ ఫ్రాజ్‌సర్ ఎన్‌సీపీఎన్ తరఫున ప్రారంగించారు. కామ్రేడ్‌లతో పార్టీ బలోపేతం కావడం వల్లనే గత కొన్నేళ్లుగా పార్టీ గణనీయంగా అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో కీలక అంశాలపై చర్చలు జరిగాయి. పార్టీ అంచనాలు, స్థానాలను వివరించే ముఖ్యమైన రాజకీయ పత్రాలను కాంగ్రెస్ స్వీకరించింది. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలపై రాజకీయ నిర్ణయం, కార్మిక ఉద్యమంలో ఎన్‌సీపీఎన్ పని, 8వ కాంగ్రెస్ వరకు ఎన్‌సీపీఎన్ విధులు, పార్టీ నిర్మాణంపై తగిన నిర్ణయంతో అనుసరించే నిర్దిష్ట పనులను సంగ్రహించే తీర్మానాలను కూడా కాంగ్రెస్ ఆమోదించింది. కొత్త ఎన్‌సీపీఎన్‌లో 11 మంది కామ్రేడ్‌లు ఉన్నారు. వీరిలో ఆరుగురు మునుపటి సీసీలో ఎన్నికైనవారే.. ఈ సందర్భంగా బెల్జియం, చిలీ, క్యూబా, ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్, గ్రీస్, జర్మనీ, డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, పాకిస్థాన్, పోర్చుగల్, రష్యా, సెర్బియా, స్పెయిన్, స్వీడన్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీల నుండి శుభాకాంక్షలు అందచేశారు.

కైంకర్యాయ స్వాహా

(మొదటిపేజీ తరువాయి)

బయటకు పొక్కనీయడం లేదు. విషయాలన్నీ గోప్యంగా ఉంచుతున్నారు. ఇదిలా ఉంటే... అనధికారికంగా వారి నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లు జరుపుతున్నట్లు సమాచారం.

ఇదిలా ఉంటే.. ఏటా డోలోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. అంతేకాదు.. పక్కనే ఉన్న ఒడిశా నుంచి కూడా తరలివస్తారు. ఈ ఉత్సవాలకు ఆర్టీసీ ఐదు రోజులపాటు ప్రత్యేకంగా బస్సులు కూడా నడుపుతుంది. తలనీలాలు, ప్రసాదాలు, ఆలయం దర్శనం ప్రత్యేకంగా టికెట్ పెట్టి మరీ భక్తుల నుంచి డబ్బు వసూలు చేస్తారు. యాత్రలో దుకాణాలు పెట్టేందుకు కూడా ఒక రేటు ఉంది. ఇలా.. ఆలయంలో ఎక్కడ నుంచి ఆదాయం వస్తుందో అన్ని చోట్లా వసూళ్లు చేస్తుంటారు. ఇక హుండీ ఆదాయం గురంచి చెప్పనే అక్కర్లేదు. ఈ సొమ్ముకు దేవదాయ శాఖ అసలు ఏ లెక్కా చూపించదు. భక్తుల నుంచి వచ్చే ఆదాయం ఏమవుతోందో అంతుపట్టడం లేదు.

వాస్తవంగా ఈ ఆదాయంతో ఆలయ అభివృద్ధి, అర్చకుల బాగోగులు చూడాలి. కానీ అదేమీ పట్టడం లేదు. ఉద్దానం ప్రాంతంలో ఉన్న స్థానికులు చందాలు వేసుకుని కాస్తో, కూస్తో అభివృద్ధి చేసుకోవడం తప్ప దేవదాయశాఖ నుంచి ఎటువంటి ప్రయత్నం లేదు. సింహాచలం వెళితే ఎంతటి పుణ్యం వస్తుందో.. ఈ దేవాలయాన్ని దర్శిస్తే అంతటి పుణ్యమని, ఇక్కడ తలనీలాలు అర్పించి, హుండీలో మొక్కులు వేసి వెళ్తుండటారు భక్తులు. ప్రతి శనివారం ఈ రూపేణా ఎంత ఆదాయం వచ్చిందో దేవదాయశాఖ బయటకు చెప్పాల్సి ఉంటుంది. అసలు ఆ లెక్కల ఊసే లేదు. ఆ శాఖ అధ్వర్యంలో ఏటా జరిగే ఉత్సవాల ఆదాయం, హుండీ ఆదాయం అసలు బయట పెట్టే అవకాశమే లేదు. దీంతో దేవుడి ఆదాయం భారీ ఎత్తున కైంకర్యం జరగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎండోమెంటు శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ భారీ దోపిడీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

ఆలస్యంలేదు... రెండ్రోజుల్లో వానలే వానలు

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు పడొచ్చు' అని జెనామణి స్పష్టం చేశారు. ఈసారి నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశంలో వర్షాలు బాగా కురుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో బలమైన గాలులు వీయడం, మేఘాలు దట్టంగా కమ్ముకోవడం చూస్తామని పేర్కొన్నారు. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రెండు రోజుల్లో రుతుపవనాల్లో పురోగతి కనిపిస్తుందని ఆయన అంచనా వేశారు. నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్తముందే పలకరించాయి. సాధారణంగా జూన్ ఒకటిన కేరళలో ప్రవేశించే నైరుతి రుతుపవనాలు మూడు రోజుల ముందుగానే వచ్చేశాయని ఐఎండీ తెలిపింది. మే 29న కేరళను రుతుపవనాలు తాకినట్లు వాతావరణ విభాగ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. అక్కడే స్థిరంగా ఉండి 4 రోజులకు కర్ణాటక, తమిళనాడును తాకాయని పేర్కొన్నారు.

15 వరకు ఢిల్లీకి ఉపశమనం లేదు

దేశ రాజధాని ఢిల్లీ -ఎన్‌సిఆర్, వాయువ్య భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత వారాంతంలో కొన్ని పాయింట్లు తగ్గుతుంది కానీ జూన్ 15 వరకు వేడి నుంచి పెద్ద ఉపశమనం లభించే అవకాశం లేదని ఐఎండీ స్పష్టం చేసింది. తేమతో కూడిన తూర్పు గాలులు జూన్ 16 నుంచి ఈ ప్రాంతంలో గణనీయంగా ఉపశమనం కలిగిస్తాయని పేర్కొంది. 'గురువారం వాయువ్య, మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్న హెచ్చరికలు ఉన్నప్పటికీ, ఉష్ణోగ్రతలో పెరుగుదల అంచనా వేయబడలేదు' అని సీనియర్ శాస్త్రవేత్త ఆర్కే జెనామణి చెప్పారు. పశ్చిమ వడ గాలుల తాకిడి కారణంగా జూన్ 2 నుండి వాయువ్య, మధ్య భారతమంతటా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. 'ఏప్రిల్ చివరి వారం, మేలో నమోదైన ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఇప్పుడు కొనసాగుతున్న ఉష్ణోగ్రతలు తక్కువ తీవ్రతను కలిగి ఉన్నాయి. అయితే ప్రభావ ప్రాంతం దాదాపు సమానంగా ఉంటుంది' అని ఆయన వివరించారు. జూన్ 12 నుంచి తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో ముందస్తు రుతుపవనాలతో వాతావరణం చల్లబడనుంది. అయితే ఉత్తర రాజస్థాన్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తర ప్రాంతాలలో జూన్ 15 వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. 'ఢిల్లీ-ఎన్‌సిఆర్‌తో సహా వాయువ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో జూన్ 11-12 తేదీలలో ఉష్ణోగ్రతల నుంచి స్వల్ప ఉపశమనం ఉన్నప్పటికీ వారాంతంలో మేఘావృతమైన వాతావరణం ఉంటుంది కానీ వర్షాలు కురిసే అవకాశం లేదు' జెనామణి అన్నారు. జూన్ 15 వరకు ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్, 43 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకానుంది. ఈ ప్రాంతాల్లో జూన్ 16 నుండి తేమతో కూడిన తూర్పు గాలుల కారణంగా ఉరుములతో కూడిన వర్షాలు కురిసి, వేడి నుండి ఉపశమనం కలుగుతుందని ఆయన చెప్పారు.

వ్యాపారంలో స్వల్పకాలిక ప్రతిఫలాన్ని ఆశించరాదు

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

ముంబై: వ్యాపారాలు... తమ బ్యాలెన్స్ షీట్‌లలో అధిక రిస్కులను పరిగణనలోకి తీసుకోకుండా స్వల్పకాలిక ప్రతిఫలాన్ని కోరే సంస్కృతిని కలిగి ఉండకూడదని భారత రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. వ్యాపారం చేయడంలో రిస్క్ తీసుకోవడం కూడా ఉంటుందని దాస్ పేర్కొన్నారు. రిస్క్ తీసుకునే ముందు ప్రతికూలాంశాలను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఐకానిక్ వీక్ వేడుకల్లో దాస్ మాట్లాడుతూ... బ్యాలెన్స్ షీట్‌లో అధిక రిస్కును పెంచుకోవడంతో సంబంధం లేకుండా స్వల్పకాలిక రివార్డ్ కోరే సంస్కృతికి వ్యాపారాలు దూరంగా ఉండాలన్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) ఈ కార్యక్రమాన్ని ముంబైలో నిర్వహించింది. ఆర్బీఐ దృష్టికి వచ్చిన కొన్ని అనుచితవ్యాపార నమూనాలు లేదా వ్యూహాల సాధారణ లక్షణాలలో అసంబద్ధంగా నిధుల సేకరణ విధానం, సంపదను పెంపొందించే రుణ అసమతుల్యతలు ఉన్నాయి... ఇవి అత్యంత ప్రమాదకరమైనవని, భరించదగ్గవి కావని దాస్ పేర్కొన్నారు. అంతేకాకుండా, అవాస్తవిక వ్యూహాత్మక అంచనాలు, ప్రత్యేకించి సామర్థ్యాలు, వృద్ధి అవకాశాలు, మార్కెట్ వాకడలపై మితిమీరిన ఆశావాదం, పేలవమైన వ్యూహాత్మక నిర్ణయాలకు దారితీయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి తరుణ్ బజాజ్, సీబీఐసీ చైర్మన్ వివేక్ జోహ్రీ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కార్ నిర్ణయాలన్నీ ఏకపక్షమే

(మొదటిపేజీ తరువాయి)

వైర్ పేర్కొంది. దొడ్డిదారిన సెక్షన్ 66ఎ అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం ఆందోళనకరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకుర్ అన్నారు. రాజ్యాంగం, కోర్టులు ఏమీ చెప్పినా మాకు నచ్చిందే మేము చేస్తామన్న ధోరణి కనిపిస్తోందన్నారు. ఈ చర్య ద్వారా తాము ఏకపక్షంగానే నిర్ణయాలు తీసుకుంటామని సుప్రీంకోర్టుకు, రాజ్యాంగబద్ధ న్యాయ నిపుణులకు, వాక్ స్వేచ్ఛ హక్కు వాదులకు, ప్రతి ఒక్కరికి ప్రభుత్వం చెప్పకనే చెబుతోందని అన్నారు. మే చివరి నుంచి వియన్నాలో సైబర్ క్రైమ్ క్రిమినలైజేషన్‌కు సంబంధించి వేర్వేరు నిబంధనలపై చర్చలను ఐరాస నిపుణుల కమిటీ జరుపుతోంది. 2015, మార్చి 24న సుప్రీంకోర్టు సెక్షన్ 66ఎను కొట్టివేసింది. న్యాయబద్ధ దర్యాప్తు సంస్థలు రాజకీయ కారణాల వల్ల దీనిని ఉపయోగించడం అనుచితమని తేల్చిచెప్పింది. 2008లో యూపీఏ ప్రభుత్వం ఈ సెక్షన్‌ను తెచ్చింది. ఆ తర్వాత సవరణ వివాదానికి తెరతీసింది. అదే క్రమంలోనే అధికారులు దీనిని వాడుకుంటూ ఇష్టారీత్యా ఫిర్యాదులు-అరెస్టులపర్వం కొనసాగించారు. 'ఐటీచట్టం -2000లోని సెక్షన్ 66ఎను కొట్టివేస్తున్నాం. ఇది రాజ్యాంగ విరుద్ధం. అధికరణ 19(1)(ఎ)లో అధికరణ 19 (2) కింద ఈ సెక్షన్ ఉండదు అని' సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరించిన ఏడు ఏళ్ల తర్వాత ఇదే సెక్షన్‌ను పేరుమార్చి అమల్లోకి తెచ్చే ప్రయత్నాలను కేంద్రప్రభుత్వం మొదలు పెట్టింది. తాము రద్దు చేసిన తర్వాత కూడా ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఎ కింద కేసులు నమోదు అవుతున్నట్లు 2021 జులైలో సుప్రీంకోర్టు గుర్తించింది. ఈ చట్టం కింద 1300 కొత్త కేసులు ఉన్నట్లు తెలిసి ఆశ్చర్యపోయింది. కేంద్రానికి మొట్టికాయలు వేసింది. దీంతో ఆ సెక్షన్ కింద కేసులు నమోదు చేయొద్దు అని, ఏవైనా ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. ఇదిలావుంటే, ఐరాసతో సైబర్ నేరాల కట్టడికి ఒప్పందం జరగబోతోందన్న అంశం పౌర సమాజాన్ని కలవరపెడుతోంది. వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందన్న ఆందోళన ఉంది. ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణ ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లితే వాక్‌స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, గోప్యతకు తావు ఉండదని మానవహక్కుల కార్యకర్త దేబోరా బ్రౌన్ గతేడాది ఓ వ్యాసంలో ప్రస్తావించారు.

సైబర్ నేరాల నిరోధక చట్టాలు దుర్వినియోగం కావడం కొత్తేమీ కాదని, ఇప్పటికే అనేక మంది పరిశోధకులు, కార్యకర్తలు, ప్రజావేగులపై తప్పుడు కేసులు, ఆరోపణలు నమోదు అయ్యాయని శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ఎన్జీవో ఎలక్ట్రానిక్ ఫ్రంటియర్ ఫౌండేషన్ వెల్లడించింది. తాజా పరిణామాలతో మానవహక్కులకు ముప్పు మరింత పెరిగిందని, మావనహక్కుల పరిరక్షణకు ఎక్కువగా ఉందని, సైబర్ నేరాల నిరోధక ఒప్పందంలో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది.

ఎనిమిది రెట్లు పెరిగిన బయో ఎకానమీ: మోదీ

న్యూఢిల్లీ : తమ ఎనిమిదేళ్ల పాలనలో భారతదేశ బయో ఎకానమీ ఎనిమిది రెట్లు పెరిగిందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దేశాభివృద్ధి లక్ష్యంగా ప్రతి రంగానికి చోదకశక్తిగా తమ ప్రభుత్వం ఉందని గొప్పగా చెప్పుకున్నారు. గతంలో కొన్ని రంగాలపైనే దృష్టి పెట్టేవారని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ధోరణిలో మార్పు వచ్చిందన్నారు. న్యూఢిల్లీలో రెండ్రోజులు నిర్వహించే బయోటెక్ స్టార్టప్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. బయో ఎకానమీ 10 బిలియన్ డాలర్ల నుంచి 80 బిలియన్ డాలర్లకు ఎనిమిదేళ్లలో పెరిగిందని; గ్లోబల్ బయోటెక్ ఎకోసిస్టమ్‌లోని టాప్ 10 దేశాల సరసన భారత్ త్వరలోనే నిల్వనుందని మోదీ అన్నారు. ఎనిమిదేళ్లలో స్టార్టప్‌ల సంఖ్య వందల స్థాయి నుంచి 70వేలకు పెరిగిందని, సులభతర వాణిజ్యం, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను తమ ప్రభుత్వం ప్రోత్సాహించిందని మోదీ చెప్పారు. 60 వేర్వేరు పరిశ్రమల్లో 70వేల స్టార్టప్స్ ఉన్నాయన్నారు. వీటిలో దాదాపు ఐదు వేలు బయోటెక్‌కు సంబంధించినవిగా తెలిపారు. ఈ రంగంలో నైపుణ్యతకు కొదవ లేదని చెప్పారు. బయోటెక్ రంగంలో పెట్టుబడిదారుల సంఖ్య తొమ్మిది రెట్లు అధికం కాగా బయోటెక్ ఇంక్యుబేటర్లు ఆరు నుంచి 75కు పెరిగినట్లు తెలిపారు. బయోటెక్ ఉత్పత్తులు నాడు పది ఉంటే నేడు 700కుపైగా ఉన్నాయన్నారు. బయోటెక్ రంగంలో నిధులు ఏడు రెట్లు పెరిగినట్లు వెల్లడించారు. ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసుకోవడం దేశానికి అవసరమని, ఇందుకోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దేశాభివృద్ధికి బయోటెక్ రంగం కీలకమన్నారు. భారతీయ బయోటెక్ రంగంలో కొత్త అవకాశాలకు కొదవ లేదని, బయో ప్రొఫెషనల్స్ కొత్త శిఖరాలకు చేరుకోవడం ఈ దశాబ్దంలో చూశామని మోదీ అన్నారు. బయోటెక్ రంగాన్ని కొత్త అవకాశాలకు నిలయంగా పరిగణనించడానికి ఐదు పెద్ద కారణాలు ఉన్నాయి.. అవి.. జనాభా, వాతావరణం, నైపుణ్యం, సులభతర వాణిజ్యం, బయో-ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండు అని మోదీ అన్నారు. బీఐఆర్ఏసీ వంటి మాధ్యమాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

అంతరిక్ష రంగంలో ఇన్-స్పేస్; రక్షణ రంగంలో ఐడెక్స్, సెమీ కండక్టర్లకు సంబంధించి ఇండియా సెమీ కండక్టర్ మిషన్, స్మార్ట్ ఇండియా హాయకథాన్స్ వంటి స్టార్టప్‌లను మోదీ ప్రస్తావించారు. ఈ రంగం స్వయంసమృద్ధికి స్టార్టప్ ఎక్స్‌పో దోహదమవుతుందని ఆకాంక్షించారు. బయోటెక్ స్టార్టప్ ఎక్స్‌పో-2022ను ఆత్మనిర్భర్ భారత్ దిశగా బయోటెక్ స్టార్టప్ ఇన్నోవేషన్స్ థీమ్‌తో గురు, శుక్రవారాలు నిర్వహిస్తారు. దేశంలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, బయో-ఇంక్యుబేటర్లు, ఉత్పత్తిదారులు, రెగ్యులేటర్లు, ప్రభుత్వ అధికారులంతా ఈ ఎక్స్‌పో ద్వారా ఒకే వేదికపైకి వచ్చారు.

'ముందస్తు' తప్పదా !

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు అనివార్యమని స్పష్టమవుతోంది. పరిమితికి మించి అప్పులు చేయడం, సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం, ప్రతి నెలా జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న ఆలోచనలో సీఎం జగన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల వరుసగా జరిగిన పంచాయతీ, మున్సిపాలిటీ, సొసైటీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైసీపీ క్లీన్‌స్వీప్ చేయడంతో... ఇదే ఊపులో అసెంబ్లీ ఎన్నికలకు వెళితే ఘన విజయం ఖాయమన్న ధీమాతో సీఎం ఉన్నారు. ఏడాది క్రితం నుంచి దీనిపై రాజకీయవర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ తాజాగా ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన అనంతరం వైసీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల వర్క్‌షాపులో సీఎం వ్యాఖ్యానాలు, ప్రకటించిన కార్యాచరణ చూస్తే ముందస్తు తప్పదనే భావన అధికార పార్టీ శాసనసభ్యుల్లోనూ వ్యక్తమవుతోంది. గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా దేశవ్యాప్తంగా వచ్చిన సార్వత్రిక ఎన్నికలకు 9 నెలలు ముందే అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. అదే ఫార్ములాను ఈసారి సీఎం జగన్ పాటించాలనే వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. షెడ్యూలు ప్రకారం 2024లో అసెంబ్లీ, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో మాత్రం గతంలో ముందస్తుకు వెళ్లినందున ఈసారి 2023లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాలి. దాంతోపాటే ఏపీకి ఎన్నికలు నిర్వహించేలా ఇటీవల సీఎం జగన్ ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను కోరినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రపతి ఎన్నికలకు వైసీపీ మద్దతు అవసరం ఉండడంతో వారు కూడా సీఎం ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఎన్నికలు ఎలాగూ 2023లో జరగాల్సి ఉన్నందున దాంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పినట్లు అధికారపార్టీ నేతలు అంటున్నారు. అదే నిజమైతే వచ్చే ఏడాది జూన్‌లోపే అసెంబ్లీని రద్దు చేసే అవకాశం ఉంది. అందుకే ఈనెల 8వ తేదీ నిర్వహించిన వైసీపీ వర్క్‌షాపులో ముఖ్యమంత్రి రాబోయే 8నెలల్లో చేయాల్సిన కార్యాచరణ ప్రకటించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేయాలని సీఎం సూచించారు. ప్రతి శాసనసభ్యుడు తప్పనిసరిగా నెలలో 20 రోజులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్దేశించారు. అంతేగాకుండా ఇకపై నేతల పనితీరుపై ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. పార్టీ నాయకులకు ప్రజల్లో ఉండే ఆదరణ ఆధారంగా వచ్చే ఎన్నికల్లో టికెట్లుంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి అక్కచెల్లమ్మలకు వివరించగల్గితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 సీట్లు వైసీపీ గెల్చుకుంటుందని, ఆ విధంగా ప్రతి నాయకుడు కృషి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులు ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే, వారి పేర్లు రాసుకుని మంజూరు చేసేలా చర్యలు తీసుకుందామని హామీ ఇచ్చారు. తద్వారా ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందని సూచించారు. ఆ సూచన పార్టీ నేతలకు కొంత ఊరటనిచ్చింది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 17 మంది మంత్రులను సామాజిక న్యాయభేరి పేరిట బస్సుయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. ఇది కూడా ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగమేనని నేతలు పేర్కొంటున్నారు.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసీపీదే అధికారమంటూ బస్సుయాత్ర సందర్భంగా మంత్రులు ఊరూరా ఎన్నికల ప్రసంగాలు చేశారు. తాజాగా వైసీపీ వర్క్‌షాపు ముగిసిన తర్వాత ఐదారుగురు మంత్రులు ఎన్నికల గురించే ప్రస్తావించారు. వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనంటూ జోస్యం చెప్పారు. వర్క్‌షాపుకు హాజరైన శాసనసభ్యులు, నేతలు ముందస్తు ఎన్నికల గురించి చర్చించుకోవడం గమనార్హం. సీఎం జగన్ ప్రధాని, అమిత్‌షాలను కలిసిన సందర్భంగా ముందస్తు ఎన్నికలకు అనుమతి కోరినట్లు వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణరాజు తెలిపారు. మరోపక్క ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని బలంగా చెపుతోంది. ఆ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. ఇలా మొత్తానికి అధికార, ప్రతిపక్ష పార్టీల్లో హడావుడి చూస్తే ముందస్తు ఖాయమని స్పష్టమవుతోంది.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ: తోమర్

జైపూర్ : కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకమైందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అన్నారు. ఆ పార్టీకి రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే యూపీఏ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి ఉండేదని పేర్కొన్నారు. రాజస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం జైపూర్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న తరుణంలోనే ఎంఎస్ స్వామినాథన్ కమిటీ రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంచాలని సిఫారసు చేశారని గుర్తు చేశారు. అటువంటి పార్టీ నేడు తమపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్నాక స్వామినాథన్ కమిటీ సిఫార్సులను ఆమోదించి తృణధాన్యాలపై 50 శాతం అదనపు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా అంతకు ముందు కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతుల కోసం అంటూ ప్రకటించిన మద్దతు ధర మోసపూరితమైందని ఆరోపించారు. 2022-23 ఖరీఫ్ పంటలకు మద్దతు ధర ప్రకటనతో మోదీ దేశ రైతాంగాన్ని మోసం చేశారని ఆరోపించారు. రైతుల ఆదాయాన్ని పెంచుతామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతుల బాధల్ని వంద రెట్లు పెంచిందని దుయ్యబట్టారు.

రూ.3,19,480 కోట్ల రుణాలు

(మొదటిపేజీ తరువాయి)

నిరాశ కల్గించే అంశం. ఈ కారణాల వల్ల రిజర్వ్ బ్యాంకు మే 6న నగదు నిల్వల నిష్పత్తిని 50 బేసిక్ పాయింట్లు పెంచింది. రెపోరేటును 40 బేసిక్ పాయింట్లు పెంచింది. జూన్‌లో దీన్ని మరో 50 బేసిక్ పాయింట్లకు రిజర్వ్‌బ్యాంకు పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాలలో ద్రవ్యోల్బణం 6శాతానికి పైబడి ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది. దీనివల్ల నగదు నిల్వలు క్రమంగా తగ్గుతాయి. ఈ పరిణామాలన్నీ దిగువ తరగతి తీవ్ర ప్రభావం చూపుతాయి. తయారీ రంగంపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. సరుకులు కొనేవారు లేకపోతే, వారు పరిశ్రమలను మూసివేసే పరిస్థితి వస్తుంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకోవాలని సీఎం బ్యాంకర్లకు సూచించారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బ్యాంకులు ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి. తక్కువ వడ్డీలకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు కోసం అవినీతి, పక్షపాతం లేకుండా ప్రత్యక్షంగా నగదు బదిలీచేస్తోంది. ప్రజల చేతుల్లో డబ్బులు పెట్టి, వారిని సాధికారిత వైపు నడిపించడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంటోంది. ఎన్నో అవరోధాలు ఉన్నప్పటికీ 2020-21లో నిర్దేశించుకున్న వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాన్ని అధిగమించి 133.19శాతం చేరుకోవడం అభినందనీయం. వ్యవసాయ రుణాల విషయానికొస్తే వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించుకున్న దానికన్నా 167.27శాతం సాధించారు. ప్రాథమికేతర రంగానికి నిర్దేశించుకున్నదానికంటే రెట్టింపు రుణాలు అంటే 208.48శాతం ఇచ్చారు. మరికొన్ని రంగాల్లో పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఎగుమతుల కోసం నిర్దేశించుకున్న దాంట్లో 31.01 శాతం, విద్యారంగానికి సంబంధించి 50.03శాతం, గృహనిర్మాణానికి సంబంధించి 36.11శాతం మాత్రమే రుణాలు ఇచ్చారు. సామాజిక ఆర్థిక ప్రగతిలో విద్య, గృహనిర్మాణం అత్యంత కీలకం. ఈ రంగాలకు బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందడుగువేసి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. కౌలు రైతులకు కేవలం 42.53శాతమే రుణాలు అందాయి. వీరికి రుణాలు అందించడంపై బ్యాంకర్లు మరింత శ్రద్ధపెట్టాలన్నారు. జగనన్న తోడు, పక్కా గృహాల నిర్మాణానికి, ఎంఎస్‌ఎంఈలు, మహిళా సాధికారతకు దోహదపడే ఆసరా, చేయూత వంటి పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం బ్యాంకర్లకు మార్గనిర్దేశనం చేశారు. అన్నింటికీ మించి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్న నగదును బ్యాంకులు మినహాయించుకోకూడదు. దీనిపై కేంద్ర ప్రభుత్వమే మార్గదర్శకాలు జారీచేసింది. ప్రత్యేక ఉద్దేశంతో, ఓ లక్ష్యం కోసం ఈ పథకాలు అమలు చేసున్నందున ఈ అంశాలను బ్యాంకులు దృష్టిలో ఉంచుకోవాలని సీఎం కోరారు. సమావేశంలో వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, ఆయా శాఖల ఉన్నతాధికారులు పూనం మాలకొండయ్య, కరికాల వలవెన్, ఎస్ఎస్ రావత్, గోపాలకృష్ణ ద్వివేది, ఎంఎం నాయక్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ వి.బ్రహ్మానందరెడ్డి, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రత్యేక కోర్టులు

(మొదటిపేజీ తరువాయి)

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతి శాసనసభ్యులు కరుణాకరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ ప్రత్యేక కోర్టులను జస్టిస్ రమణ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జస్టిస్ రమణ సూచన సూచన మేరకు మరో కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చివరిగా సీజేఐ రమణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ఇ.భీమారావు, అటవీశాఖ అధికారి ఎన్.ప్రదీప్‌కుమార్, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఏవీ రవీంద్రబాబు, హైకోర్టు రిజిస్ట్రార్ అడ్మినిస్ట్రేటివ్ వెంకటరమణ, ఫ్యామిలీ కోర్టు, న్యాయాధికారులు జి.అన్వర్‌బాషా, వై.వీర్రాజు, ఏ.సత్యానంద్, బార్ అసోసియేషన్ సభ్యులు ఆర్.పద్మజ, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ రాజారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రపంచంపై యుద్ధ ప్రభావం: గుటెర్రస్

ఐరాస : ఉక్రెయిన్ వివాదం ప్రపంచ పరిణామాలపై పెనుప్రభావం చూపుతోందని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించారు. ఇప్పటికే ఆరు దేశాలు కరవు పరిస్థితుల్లో ఉన్నాయని ఐరాస తెలిపింది. 94 దేశాలలో 1.6 బిలియన్ల మంది ప్రజలు కరవు బారిన పడే అవకాశం ఉందని అన్నారు. గత ఆరు నెలల్లోనే తీవ్రమైన ఆకలిని ఎదుర్కొంటున్న వారి సంఖ్య 50 మిలియన్లు పెరిగింది. ప్రపంచ స్థాయిలో త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే, సామూహిక కరవు మళ్లీ సంభవిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ గోధుమల్లో మూడవవంతు రష్యా,ఉక్రెయిన్ పండిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఎరువులు ఎగుమతి చేసే దేశాల్లో రష్యా ముందుంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆహారధాన్యాల దిగుమతి ఖర్చు 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు, యుద్ధం ఆకలి, పేదరికానికి గురవుతున్నారని గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు సామాజిక, ఆర్థిక గందరగోళానికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ఓడరేవుల ద్వారా వివిధ వస్తువులను ఎగుమతి చేసే ఉక్రెయిన్, పశ్చిమ దేశ సరిహద్దుల ద్వారా, డాన్యుబ్ నది ఓడరేవులు, రైలు ద్వారా ధాన్యాన్ని రవాణా చేయవలసి రావడంతో సుమారు 1 మిలియన్ టన్నులకు పడిపోయింది.

ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలు ఇప్పటికే ఆహార కొరతను ఎదుర్కొంటున్నాయి, పరిస్థితి రోజురోజుకు మరింత అధ్వాన్నంగా ఉందని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం, ప్రపంచంలో వరుసగా మూడవ, నాల్గవ అతిపెద్ద ధాన్యం ఎగుమతిదారులు, ఆహార ధరల ద్రవ్యోల్బణాన్ని పెంచడంతోపాటు ప్రపంచ ఆహార సరఫరాలను ప్రమాదంలో పడేసింది. లెబనాన్ తన గోధుమలలో 80శాతం ఉక్రెయిన్ నుండి దిగుమతి చేసుకుంటుంది. తాజా పరిస్థితులతో ఈ సంక్షోభం 2023 వరకు విస్తరించే అవకాశం ఉందని గుటెర్రస్ పేర్కొన్నారు.

లోకేశ్ జూమ్ మీటింగ్‌లోకి నాని, వంశీ!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులతో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జూమ్ సమావేశంలోకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తదితరులు కొందరు విద్యార్థుల ఐడీతో సమావేశంలోకి ప్రవేశించి లోకేశ్‌కు ఝలక్ ఇచ్చారు. విద్యార్థులతో పాటు వీరు పాల్గొనడం చర్చనీయాంశమైంది. వీరిద్దరిని చూడగానే టీడీపీ సాంకేతిక విభాగం సిబ్బంది, జూమ్ నిర్వాహకులు ప్రసారాన్ని నిలిపివేశారు. కొత్తపల్లి రజిని అనే మహిళ మాట్లాడుతూ లోకేశ్‌పై జూమ్ సమావేశంలో ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల జీవితాలతో ఆటలేంటని నిలదీసింది. మరో విద్యార్థితో పాటు జూమ్‌లోకి గుర్రంపాటి దేవేందర్ ప్రవేశించి నారా లోకేష్‌తో వాగ్వివాదానికి దిగారు. నాడు పిల్లలకు పరీక్షలు పెట్టొదని ఎందుకు చెప్పారని లోకేశ్‌ను నిలదీశారు. అదే రీతిలో లోకేశ్ సైతం వైసీపీ ప్రభుత్వంపైన మండిపడ్డారు. జూమ్‌లోకి వచ్చిన వైసీపీ నేతల తీరును తప్పుబట్టారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ, రివర్స్ పాలన వల్లే పదో

- కట్ చేసిన టీడీపీ సాంకేతిక సిబ్బంది
- పది రివర్స్ ఫలితాలు నారా లోకేశ్

తరగతిలో రివర్స్ అయ్యాయని మండిపడ్డారు. పది ఫలితాలు చూసిన తర్వాత తాను షాక్‌కి గురయ్యానని చెప్పారు. నాడు-నేడులో భారీగా అవినీతికి పాల్పడి ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. అమ్మఒడి ఇవ్వడానికి నిధుల్లేక-అప్పులు దొరక్క ఇప్పటికే వాయిదాలు వేసుకుంటూ వచ్చిన ప్రభుత్వం, లబ్ధిదారులను తగ్గించే కుట్రలో భాగంగానే టెన్త్ ఫలితాల్లో అత్యధికుల్ని ఫెయిల్ చేసిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు తమ మీటింగ్‌లోకి రావడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులను అడ్డం పెట్టుకొని దద్దమ్మల్లా మీటింగ్‌లోకి వస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థిని తండ్రి కె.హనుమంతరావు మాట్లాడుతూ పది ఫలితాల్లో నాలుగు మార్కులు తగ్గాయని తన బిడ్డ వెన్నెల ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు తదితరులు పది ఫలితాల తీరును తప్పుబట్టారు.

విద్యార్థులతో రాజకీయాలేంటో?
కొడాలి నాని ఆగ్రహం

అభం శుభం తెలియని చిన్న పిల్లలను ఆత్మహత్యలకు ప్రేరేపించేందుకు లోకేశ్ ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే కొడాలి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ధైర్యం చెప్పకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తాము ఫేక్ ఐడీలతో లాగిన్ అవ్వలేదనీ, తన మేనల్లుడి ఐడీతో మాట్లాడేందుకు ప్రయత్నించినట్లు స్పష్టం చేశారు. విద్యార్థి మేనమామతో లోకేశ్ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. పిల్లలు కొడతారనే భయంతోనే లోకేశ్ జూమ్‌లో మాట్లాడారని ఎద్దేవా చేశారు. విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలు తెరిస్తే, కరోనా సమయంలో పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతారా అని పాఠశాలలను టీడీపీ వాళ్లే మూయించారని గుర్తుచేశారు.

విశాఖ ఉక్కుపై ఉద్యమం ఉధృతం
ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు

విశాలాంధ్ర-విశాఖ: విశాఖ ఉక్కు పరిరక్షణ ధ్యేయంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు పిలుపునిచ్చారు. ఉక్కు ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో మసేన్‌రావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన యూనియన్ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం మొదలై ఈ నెల 26 నాటికి 500 రోజులు పూర్తికానున్న సందర్భంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని, ఆ ఉద్యమంలో నిర్వాసితులు ప్రధాన భాగస్వాములు కావాలన్నారు. వైజాగ్ స్టీల్ కార్మికవర్గం మనపై నమ్మకంతో అధికారం ఇచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. వైజాగ్ స్టీల్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కృత్రిమ బొగ్గుకొరత సృష్టిస్తోందని, తద్వారా గతంలో టన్ను రూ.4,100 ఉన్న బొగ్గును దాదాపు రూ.39వేలకు పెంచి అదానీ కంపెనీ నుంచి కొనుక్కొనే పరిస్థితి కల్పించడం దారుణమన్నారు. దీనివల్ల కంపెనీపై అధిక భారం పడుతుందని, దీనిని వ్యతిరేకిస్తున్నామన్నారు. డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉత్పత్తి తగ్గించి నష్టాల పరిశ్రమగా చూపించాలని తహతహ లాడుతున్నదని, అంతేకాకుండా ఆర్థిక ప్రయోజనాలను ఒక్కొక్కటి తొలగిస్తూ కార్మికుల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. వీటన్నికి సమాధానంగా అన్ని యూనియన్లను కలుపుకుని ఐక్యపోరాటం చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం రాజకీయ మద్దతు కూడగడతామన్నారు. 2017 వేతనం సవరణ, ప్రోత్సాహకాలు, వైద్య, ఇతర కార్మిక సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం యాజమాన్యంపై వత్తిడి తెస్తామని చెప్పారు. సమావేశంలో జి.బోసుబాబు, ఎస్.మిశ్రా, జె.రామకృష్ణ, డి.నర్సింగరావు, నరేశ్ కుమార్, కె.రాజబాబు, పోలయ్య, జి.జయ, యల్లేటి శ్రీనివాస్, ఇతర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అలా అయితే ప్రభుత్వాన్ని

రద్దు చేయండి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ సీట్లు గెలుస్తాననే నమ్మకం వుంటే ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు రావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నా యుడు వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకొని దాదాపు పది మంది విద్యార్థుల ప్రాణాలు వైసీపీ పాలకులు బలితీసుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో జూమ్ కాల్స్ నిర్వహిస్తుంటే వైసీపీ నాయకులు ఆటంకపరిచారు. టెన్త్ క్లాస్ పాస్ కాని కొడాలి నానికి జూమ్ మీటింగ్‌లో ఏం పని? అని ప్రశ్నించారు. విద్యార్థులకు ధైర్యాన్ని ఇవ్వాలని లోకేశ్ జూమ్ మీటింగ్ నిర్వహిస్తే ఈ రకంగా భంగం కలిగించడం ఎంతవరకు సమంజసం? దీనిపై సంబంధిత అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. 30 ఏళ్లు మాదే పాలన అని డాంభికాలు పలికిన జగన్, ఇప్పుడేమో వచ్చే ఎన్నికలు కీలకమంటున్నారంటే, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను చూసి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపి, ప్రజలపై అధిక ధరలు, పన్నుల భారాలు మోపారు. వైసీపీ మూడేళ్ల ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క అభివృద్ధి పనైనా చేశారా? వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

నూతన విద్యా విధానం వద్దే వద్దు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: నూతన విద్యా విధానం పేరుతో ఇప్పటికే 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడం వలన వేల పాఠశాలలు మూతపడ్డాయని, ఖాళీగా ఉన్న 26వేల ఉపాధ్యాయ పోస్టులు ఆగిపోయాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కే మస్తాన్, జిల్లా ప్రధానకార్యదర్శి సీహెచ్ లక్ష్మారెడ్డి విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తూ...సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న నూతన విద్యావిధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యావిధానానికి వ్యతిరేకంగా ఈ నెల 13న దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నామని, మేధావులు, విద్యావంతులు, విద్యార్థినీవిద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నీట్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించడం వలన పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమతున్నారని, తక్షణమే దానిని

రద్దుచేసి యథావిధిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం పూర్తయినందున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి ఇవ్వకపోవడం వలన ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు డబ్బులు చెల్లిస్తే కానీ విద్యార్థులకు టీసీలు ఇవ్వడం లేదని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని కోరారు. ముందస్తు ప్రవేశాల పేరుతో నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తుంటే ఆర్‌ఐఓ, డీఈఓ, విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు, నాయకులు మహేంద్ర, రాజమోహన్‌రెడ్డి, వాసు, శ్రీను, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేస్తున్న పాలకులు
రాజేంద్రబాబు, లెనిన్ బాబు

విశాలాంధ్ర-బెలగాం: నిరుద్యోగ యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఎన్నికల సమయంలో ఓట్ల కోసం యువతను మభ్య పెడుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్ బాబు

గోపినాయుడు, బీటీ నాయుడు

అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య ఉమ్మడి విజయనగరం జిల్లా సమావేశం విజయనగరం అమర్ భవన్ లో జిల్లా అధ్యక్షులు కోట అప్పన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగం భర్తీ చేయకపోగా ప్రభుత్వ శాఖలు బీఎస్ఎన్ఎల్, కోల్, రైల్వేలాంటి సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిందన్నారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని నిరుద్యోగ యుతను మోసం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసేంతవరకు ఏఐవైఎఫ్ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ నాగరాముడు, సీపీఐ విజయనగరం జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, ఏవైఎఫ్ జిల్లా కార్యదర్శి తోట జీవన్ తదితరులు పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా నూతన అధ్యక్షుడిగా కూరంగి గోపినాయుడు, ప్రధాన కార్యదర్శిగా బీటీ నాయుడు, ఉపాధ్యక్షులుగా సింహాద్రి కిరణ్, గోపాలం, బి.బలరాం సహాయ కార్యదర్శులుగా బి.బంగారి, సతీష్, ఎన్. గణేష్, కోశాధికారిగా గేదెల చందు, 11 మందితో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

విద్వేష రాజకీయాలకు ముకుతాడు
'జనం కోసం సీపీఎం' పోస్టర్ ఆవిష్కరించిన శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ, వైసీపీ, టీడీపీ కులమత విద్వేషాలు రగిలించి ప్రజల్లో చీలికలు, రాజకీయలబ్ధి కోసం ఆరాటపడుతున్నాయని, ఈ విద్వేష రాజకీయాలను ప్రజల అజెండాతోనే అరికడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. సీపీఎం చేపట్టిన 'జనం కోసం సీపీఎం' పోస్టర్‌ను గురువారం బాలోత్సవ్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఏ గఫూర్, ఎం.సీతారామ్, డి.రమాదేవితో కలిసి ఆయన ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ప్రజాభిప్రాయాలను పట్టించుకోవడం లేదనీ, ఆ పార్టీ బీజేపీతో కలిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజల బాధలు పెరుగుతున్నాయని, వాటిని పక్కదారి పట్టించేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు, వాటి ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆందోళనలు, పోరాటాలు క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకే ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇది జూన్ నుంచి ఆగస్టు వరకు కొనసాగుతుందని వివరించారు. బీజేపీ

జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్ట్రంలో పర్యటించి కులాలు, మతాల పేరుతో విద్వేషాలు రగిలించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అల్లూరి సీతారామరాజు పేరు ఉచ్చరించే అర్హత బీజేపీ నాయకులకు లేదన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ప్రజల కోసం చేసిన పనులేమిటో ఒక్కటంటే ఒక్కటి చెప్పాలని సవాల్ చేశారు. డబుల్ ఇంజిన్ స్పీడుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని నడ్డా చెబుతున్నారని, అది అభివృద్ధి కాదని, దాన్ని కూల్చే బుల్డోజర్ రాజకీయమని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ పేరుతో జిల్లా పేరు పెడతామంటే వ్యతిరేకించే బీజేపీ... ప్రజలకు ఏమి న్యాయం చేస్తుందని ప్రశ్నించారు.

మద్యపాన అనర్థాలపై విస్తృత ప్రచారం
ఆర్టీసీ ఎండీ తిరుమలరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యపానంతో వచ్చే అనర్థాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలోని మద్య విమోచన ప్రచార కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్లు-స్టిక్కర్లు, బోర్డులను గురువారం విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు విడుదల చేశారు. దీనికి ఆంధ్రప్రదేశ్ మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ... మద్యపాన వ్యసనం వల్ల జీవితంలో సర్వం కోల్పోతారని, అనేక అనర్థాలు తలెత్తుతున్నాయని వివరించారు. మద్యం సేవించి విధులకు వచ్చే వారి పట్ల సంస్థలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, వారిలో మార్పు కోసం కృషి చేస్తున్నామన్నారు. విమోచన ప్రచార కమిటీ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. మద్య విమోచన ప్రచార కమిటీ పోస్టర్లను ఆర్టీసీ బస్సులపైన, ఆర్టీసీ

ప్రాంగణాలలో ఉంచడం ద్వారా కోట్లాది మంది ప్రజల దృష్టికి మద్య పానం వల్ల కలిగే దుష్ఫలితాలను తీసుకెళ్తామన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులలో చైతన్యం తీసుకురావడానికి ఈ విద్యాసంవత్సరంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, ఆర్ట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల్లో మద్య పానం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ.కోటేశ్వరరావు, పి.కృష్ణమోహన్, జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, ఎస్‌వీ రాఘవరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసు సాక్షి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షిగా ఉన్న కల్లూరి గంగాధర్‌రెడ్డి (49) అనుమానాస్పదరీతిలో మృతిచెందారు. అనంతపురం జిల్లా యాడికిలోని ఇంట్లో బుధవారం రాత్రి ఆయన చనిపోయారు. నిద్రపోయిన సమయంలో గంగాధర్‌రెడ్డి మృతి చెందినట్లు గుర్తించిన కుటుంబసభ్యులు.. పోలీసులకు

సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఘటనాస్థలానికి క్లూస్‌టీమ్ చేరుకుని పరిశీలించింది. అనంతరం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్వస్థలం పులివెందులే..

కల్లూరు గంగాధర్‌రెడ్డి అలియాస్ కువైట్ గంగాధర్‌రెడ్డి స్వస్థలం పులివెందుల. పదేళ్ల క్రితం ఆయన యాడికికి మకాం మార్చారు. వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న శివశంకర్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ పలు నేరాలు చేశారు. వివేకా హత్య కేసులో గతేడాది అక్టోబర్ 2న సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసును తనపై వేసుకుంటే రూ.10కోట్లు ఇస్తానని శివశంకర్‌రెడ్డి చెప్పినట్లు సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రమేయం ఉందని చెప్పాలని తనపై సీబీఐ అధికారులు ఒత్తిడి తెచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తానే వైఎస్ వివేకానందరెడ్డిని చంపానని ఒప్పుకోవాలని సీబీఐ అధికారులు ఒత్తిడి తెచ్చారని ఆ సమయంలో ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుతో తనకు సంబంధం లేదని ఆయన అప్పట్లోనే స్పష్టం చేశారు. ఈ విషయమై అప్పటి అనంతపురం ఎస్పీ ఫకీరప్ప స్పందించారు. గంగాధర్ రెడ్డి ఫిర్యాదు ఆధారంగా రక్షణ కల్పిస్తామని చెప్పారు. ఈ విషయమై డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేయిస్తామని కూడా ఎస్పీ ఫకీరప్ప అప్పట్లోనే మీడియాకు చెప్పారు. తప్పుడు సాక్ష్యం చెప్పాలని తనను బెదిరింపులకు గురి చేస్తున్నారనే అంశంతో పాటు గంగాధర్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశంపై విచారణ చేస్తామని ఎస్పీ వివరించారు.

అమరావతిలో వైభవంగా

వెంకన్న ఆలయ మహాసంప్రోక్షణ

- గవర్నర్, టీటీడీ చైర్మన్, శారద పీఠాధిపతి హాజరు
- శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి రాజధాని ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ జరిగింది. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి, విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. అంతకు ముందు తెల్లవారుఝామున పుణ్యాహవచనం, కుంభారాధన, నివేదన, హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మా నందేంద్ర సరస్వతి, ఎంపీ సురేష్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సత్యనారాయణ, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్‌జవహర్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, దేవాదాయ కమిషనర్ హరిజవహర్ లాల్, ఎమ్మెల్యే శ్రీదేవి, గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ క్రిష్టిన, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి మాట్లాడుతూ రూ.31 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణం అమరావతిలో పూర్తి చేశామని, సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీవారి ఆలయాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇటీవల విశాఖ, భువనేశ్వర్‌లో శ్రీవారి ఆలయాలు ప్రారంభించినట్లు చెప్పారు. అదే విధంగా ఉత్తర భారతదేశంలోని జమ్మూలో 60 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా వెనుకబడిన ప్రాంతాల్లో 500 ఆలయాలు పూర్తి చేశామని, రాబోయే రెండేళ్లలో గిరిజన, మత్స్యకార, బడుగు బలహీన వర్గాల ప్రాంతాలలో 1300 శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యయప్రయాసలకోర్చి తిరుమల వెళ్లే భక్తులకు అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మించడం ద్వారా ఇక్కడే స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు.

బీజేపీ మోసపూరిత ప్రచారం తిప్పికొట్టాలి
సామాజిక విశ్లేషకులు లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ మోసపూరిత ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలని సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ కోరారు. బీజేపీ ప్రచురించిన పుస్తకంలోని రెండు పేజీలు తాను చదివి స్పందిస్తున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పార్టీ ఇంత దారుణంగా అక్షర రూపంలో అబద్ధాలు చెప్పడం గర్హణీయమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి లేదా? అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని మోదీ కాదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ఖజానా నుంచి రూ.1500 కోట్లు ఇచ్చారనీ, అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా గుర్తించారనీ, కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌తోనే హైకోర్టు అమరావతిలో నెలకొల్పబడిందనీ వివరించారు. రాజ్‌భవన్‌తోపాటు రాష్ట్ర పరిపాలన ఎక్కడ నుంచి జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. శాసనమండలి, శాసనసభ సమావేశాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయని నిలదీశారు. జగన్ ప్రభుత్వం రాజధాని అంశంపై అనుసరించిన అప్రజాస్వామిక విధానంపై మోదీ ప్రభుత్వం ఎందుకు గోడమీదపిల్లి వాటం ప్రదర్శించిందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి, కేంద్ర జలశక్తి, సాంకేతిక సలహా మండలి ఆమోదించిన డీపీఆర్-2 అంచనా వ్యయానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎందుకు ఆమోదం తెలపలేదని అడిగారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక తరగతి హోదా వేర్వేరని, వాటి మధ్య తేడా ఉందని వివరిం చారు. ప్రత్యేక హోదాను జమ్మూకశ్మీర్‌కు రాజ్యాంగబద్ధంగా కల్పించగా, దాన్ని మోదీ ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రత్యేక తరగతి హోదాను ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభ వేదికగా రాత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

చరిత్రాత్మకం ఆరోగ్యశ్రీ: మంత్రి విడదల రజని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ తీసుకొచ్చిన సరికొత్త వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతో మేలు చేస్తోందని, చరిత్ర చెప్పుకునేలా ఈ పథకాన్ని మార్చారని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని కొనియాడారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆరోగ్యశ్రీ విభాగంపై ఆమె సమీక్ష చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెడితే, ఈ పథకానికి జగన్ మరింత మెరుగులు దిద్ది దిగ్విజయంగా ముందుకు నడిపిస్తున్నారని మంత్రి తెలిపారు. టీడీపీ పాలనలో ఆరోగ్యశ్రీ కింద కేవలం 1059 రోగాలకు మాత్రమే చికిత్స అందిస్తే...జగనన్న ఏకంగా 2,434 రోగాలకు ఆరోగ్యశ్రీ వర్తించేలా చేశారన్నారు. పొరుగు రాష్ట్రాల రాజధాని నగరాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని చెప్పారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో ఏకంగా 200 ఆస్పత్రుల ద్వారా సేవలు అందజేస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆసరా కింద బాధితులకు రోజుకు రూ.225 చొప్పున, గరిష్టంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నామని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సీఎం జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా అందరం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఆరోగ్యశ్రీ సీఈవో వినయ్‌చంద్, ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వివేకా హత్యకేసు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివేకా హత్య కేసును వేగవంతంగా ఓ కొలిక్కి తీసుకురావాలని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు డిమాండు చేశారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నిందితులందరిని నిష్పక్షపాతంగా అరెస్టు చేయాలనీ నిందితులు, అనుమానితులు, దొరికిన సాక్ష్యాలను తారుమారు చేయడానికి అవినాష్‌రెడ్డి పూర్తిగా ప్రయత్నించారని విమర్శించారు. వివేకా హత్యకేసును నీరుగారుస్తున్నారని పేర్కొన్నారు. సొంత బాబాయి హత్య జరిగిన విషయం తెలియనట్లుగా జగన్ వ్యవహరించడం తగదనీ, వివేకా హత్య కేసులో వెలుగులోకి రావాల్సిన విషయాలు చాలా ఉన్నాయన్నారు. నాడు ప్రతిపక్షం హత్య చేయించిందంటూ, వైసీపీ ప్రచారంచేసి, ఆ సానుభూతితో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. వివేకా హత్యకేసులో బయటపడుతున్న నేరస్థులను మట్టుపెట్టడమే వైసీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారన్నారు. కేసు ఒప్పుకుంటే 10 కోట్లు ఇస్తామంటూ చనిపోయిన గంగాధర్‌రెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వివేకా హత్య కేసులో ప్రత్యేక దృష్టి పెట్టి నిందితులకు శిక్ష పడేలా చేయాలని డిమాండు చేశారు. ఈ వివేకా హత్యకేసును వెంటనే నిగ్గు తేల్చాలన్నారు.

సంపాదకీయం

రాజకీయాలకు విద్యా ప్రమాణాలు బలి

రాష్ట్రాలు నిర్వహించే విశ్వవిద్యాలయాలకు గవర్నర్లు చాన్స్‌లర్లుగా ఉండడం ఆనవాయితీ. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రే విశ్వవిద్యాలయాలకు చాన్స్‌లర్‌గా ఉండడానికి అవకాశం కల్పిస్తూ శాసనసభలో బిల్లులు ఆమోదించింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని బెంగాల్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రబలమైన కారణమే ఉంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లకు, ముఖ్యమంత్రులకు మధ్య తరచుగా ఘర్షణ వాతావరణం ఉంది. బెంగాల్‌లో కూడా ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గవర్నర్ జగ్దీప్ సింగ్ ధన్‌కర్‌కు మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గున మండే పరిస్థితి ఉంది. వైస్ చాన్స్ లర్లను నియమించడంలోనూ, విశ్వవిద్యాలయాల నిర్వహణలోనూ వీరిద్దరి మధ్య అనేక వివాదాలు తలెత్తాయి. వైస్ చాన్స్‌లర్లను నియమించే అధికారం గవర్నర్‌ది అని, తన ప్రభుత్వ వైఫల్యాల నుంచి జనం దృష్టి మళ్లించడానికే మమతా బెనర్జీ ఈ బిల్లులు ఆమోదింప చేశారని ధన్‌కర్ అంటున్నారు. కొన్ని సందర్భాలలో తాను నియమించిన వైస్ చాన్స్‌లర్లే తాను సమావేశాలు ఏర్పాటు చేసినా హాజరు కావడం లేదని కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ పరిస్థితి ఒక్క బెంగాల్‌కే పరిమితమైంది కాదు. వైస్ చాన్స్‌లర్లను నియమించడానికి గవర్నర్లకు ఉన్న అధికారాన్ని తృణమూల్ కాంగ్రెస్ 2019లోనే కట్టడి చేసింది. వారి మీద చర్య తీసుకునే అధికారం కూడా గవర్నర్‌కు లేకుండా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే విశ్వవిద్యాలయాలు కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి సమావేశాలు ఏర్పాటు చేయవచ్చు. కానీ ఆ విషయం గవర్నర్‌కు తెలియకుండా చేయకూడదన్నది నియమం. అదే సమయంలో గవర్నర్ వైస్ చాన్స్‌లర్లకు ఏ విషయమైనా తెలియజేయడానికి అధికారం ఉన్నా ఆ పని రాష్ట్ర విద్యాశాఖ ద్వారానే జరగాలి. ఒరిస్సాలో కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి విశ్వవిద్యాలయాల నిధుల సంఘానికి (యు.జి.సి.) మధ్య ఒరిస్సా విశ్వవిద్యాలయాల (సవరణ) చట్టంపై హైకోర్టులో కేసులే నడిచాయి. ఈ చట్టం ద్వారా వైస్ చాన్స్‌లర్లను నియమించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే దఖలు పరిచారు. యు.జి.సి. ఈ చట్టాన్ని సవాలు చేసింది. ఇది నిబంధనలకు విరుద్ధమని వాదించినా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. చాలా సందర్భాలలో గవర్నర్‌లే రాష్ట్రాలు నడిపే విశ్వవిద్యాలయాకు చాన్స్‌లర్లుగా ఉంటున్నారు. ఆ విశ్వవిద్యాలయాలను నిర్వహించడానికి, అందులో గవర్నర్‌ల పాత్ర గురించి ఆయా రాష్ట్రాలలో చట్టాలు ఉన్నాయి. వైస్ చాన్స్ లర్లను నియమించే అధికారం కూడా చాలా చోట్ల గవర్నర్లకే ఉంది. అయితే గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వ సలహా మేరకు నడుచుకునే చోట్ల ఘర్షణలు ఉండవు. కానీ గవర్నర్‌లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా వారు వ్యవహరిస్తారు. అయితే విశ్వవిద్యాలయాలకు చాన్స్ లర్లుగా ఉండే గవర్నర్‌లు వాటి నిర్వహణ విషయంలో స్వతంత్రంగా వ్యవహరించవచ్చునని ఇంతవరకూ భావించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం నడిపే పార్టీ ఒకటే కానప్పుడు గవర్నర్ల పాత్రే వివాదాస్పదం అవుతున్న సందర్భాలు ఈ మధ్యన పెరిగిపోయాయి. ఇక విశ్వవిద్యాలయాల విషయంలో అభిప్రాయ భేదాలకు కొదవేం ఉంటుంది! విశ్వవిద్యాలయాల నిర్వహణలో గవర్నర్‌ల పాత్ర ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలకు అనుగుణంగా ఉంటుంది కాబట్టి దేశ వ్యాప్తంగా ఏక రూపత లేదు.

గవర్నర్లను చాన్స్‌లర్లుగా నియమించడంలో మౌలిక ఉద్దేశమే విశ్వ విద్యాలయాల్లో నిర్దిష్ట రాష్ట్రంలో ఉన్న రాజకీయ ప్రభావాన్ని నివారించడం. కేరళలో విశ్వవిద్యాలయాల దగ్గరకు వచ్చేటప్పటికి గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించవచ్చు. ప్రభుత్వ సలహాతో నిమిత్తం లేదు. కానీ ప్రస్తుతం కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వానికి, గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు పొసగడం లేదు. అందువల్ల ఆయన చాన్స్‌లర్‌గా ముఖ్యమంత్రే ఉండనివ్వండి అని నర్మగర్భంగా నిరసన తెలియజేస్తున్నారు. దీనికోసం రాష్ట్ర అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశ పరచాలని కూడా ఆయన సూచించారు. అదే రాజస్థాన్ లో అయితే రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి వైస్ చాన్స్‌లర్లను గవర్నర్ నియమిస్తారు. ఇద్దరు వైస్ చాన్స్‌లర్ల నియామకంలో కేరళ ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య విభేదాలు బహిర్గతమైనాయి. తమిళనాడు ప్రభుత్వం అయితే 1994లోనే ముఖ్యమంత్రినే చాన్స్‌లర్‌గా చేయడానికి అనువుగా బిల్లులను ఆమోదించింది. మద్రాస్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ నియామకంలో ప్రభుత్వానికి, అప్పటి గవర్నర్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చాన్స్‌లర్ స్థానం అలంకార ప్రాయమైందే కనక అక్కడ వివాదాలు తక్కువగా కనిపిస్తున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చాన్స్‌లర్ పాత్ర స్నాతకోత్సవాలకు అధ్యక్షత వహించడానికే పరిమితం అవుతోంది. కామన్వెల్త్ దేశాలలో చాన్స్‌లర్ పదవి అలంకార ప్రాయమే. వైస్ చాన్స్‌లరే ప్రధాన కార్య నిర్వహణాధికారి. గుజరాత్‌లో అయితే 1949 నుంచి ముఖ్యమంత్రికే వైస్ చాన్స్‌లర్లను నియమించే అవకాశం ఉంది. తెలంగాణలో ఈ పద్ధతి 1991 నుంచి అమలులో ఉంది. ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందే తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి తానే చాన్స్‌లర్ పదవి చేపట్టారు. విశ్వవిద్యాలయాల నిర్వహణ అందులో గవర్నర్ల పాత్ర ఒకేలా లేదు. ఇటీవలే తమిళనాడు ప్రభుత్వం వైస్ చాన్స్‌లర్లను నియమించే అధికారం ప్రభుత్వానికే ఉంటే ఎలా ఉంటుందో పరిశీలించాలని నిర్ణయించింది. అంటే గవర్నర్ పాత్రలో మార్పు చేయాలన్న ఉద్దేశం ఉన్నట్టే. కొన్నాళ్ల కింద మహారాష్ట్రలోనూ వైస్ చాన్స్‌లర్ల నియామకంలో గవర్నర్ పాత్రను పరిమితం చేశారు. ఏమైతేనేం వైస్ చాన్స్‌లర్ల నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు మధ్య శ్రుతి కుదరక పోవడం చాలా రాష్ట్రాలలో ఉన్న సమస్యే. విశ్వ విద్యాలయాల వైస్ చాన్స్‌లర్లుగా గవర్నర్ నియమిస్తారా లేదా రాష్ట్ర ప్రభుత్వమే ఆ పని చేస్తుందా అన్న విషయంకన్నా వైస్ చాన్స్‌లర్ల నియామకంలో దాపరికం, పక్షపాత ధోరణి ఉండకుండా ఉంటేనే విశ్వవిద్యాలయాలో ప్రమాణాలను పరిరక్షించడానికి అవకాశం ఉంటుంది. గవర్నర్ల పాత్ర వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో 2010లో ఏర్పాటు చేసిన పూంఛీ కమిషన్ గవర్నర్లను ఇంపీచ్ చేసే అవకాశం శాసనసభకు ఉండాలని సిఫార్సు చేసింది. గవర్నర్ల నియామకంలో రాష్ట్రాలను సంప్రదించాలని కూడా చెప్పింది. రాజకీయాలే ప్రధానమైనప్పుడు విద్యా ప్రమాణాలు బలి కాకుండా ఉండడం అసాధ్యం. చాన్స్‌లర్ల నియామకంలో అన్ని రాష్ట్రాలలో ఒకే విధానం ఉండేలా ఏర్పాటు చేయడం మంచిది.

అలవోకగా అబద్ధాల ప్రచారం

సురేష్ బాబు

బీకాంలో ఫిజిక్స్ ఉంటుంది అని ఖరాఖండిగా చెప్పిన నాయకుడు మన జలీల్ ఖాన్‌తో బీజేపీ నాయకులు పోటీపడుతున్నారు. మొన్న అమిత్ షా మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు తెలంగాణ పోరాట యోధుడని పొగిడారు. నిన్నటికి నిన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఒక అడుగు ముందుకు వేసి ఆరోగ్యశ్రీ పథకం తాము రూపొందించిన ఆయుష్మాన్ భారత్ కాపీ పథకం అని, ఆరోగ్యశ్రీ కేవలం రాష్ట్రంలో చెల్లుబాటు అవుతుందని సెలవిచ్చారు. మన దేశానికి చెందిన బ్యాంకుల ద్వారా వేలాది కోట్లు రుణం తీసుకొని విదేశాలలో ఆశ్రయం పొందుతున్న మాల్యా గురించి బీజేపీ పూర్వ అధ్యక్షులు నితిన్ గడ్కరీ మాట్లాడుతూ మాల్యా చాల మంచివాడు, మంచి వ్యాపారవేత్త, విమాన రంగంలో నష్టాల వల్ల విదేశాలకు వెళ్ళాడు, వ్యాపారంలో కష్టనష్టాలు సహజమే అంత మాత్రాన ఆయనను ఎగవేతదారుడు అని ముద్ర వేస్తారా? అందరినీ దొంగలంటే ఆర్థిక ప్రగతి ఎలా సాధ్యపడుతుంది అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ పథకం 2005లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన పథకం, ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు నడ్డా ప్రసంగాన్ని తెలుగులో అనువదిస్తున్న పురందరేశ్వరి ఒకింత ఆశ్చర్యపోయారు. అయినా ఎక్కడా తగ్గకుండా తడబడకుండా తర్జుమా చేశారు. కరోనా సెకండ్ వేవ్‌లో బీజేపీ పాలిస్తున్న కర్ణాటక నుంచి లక్షలాది మంది ప్రాణాలు చేతపట్టుకొని ఆంధ్ర ఆసుపత్రులలో చేరిన సంగతి మరచిపోయారు. ప్రజా ఆరోగ్యాన్ని పటిష్టపరచలేని కేంద్ర ప్రభుత్వం, వైరస్ వ్యాప్తిని నియంత్రించక చప్పట్లు కొట్టి, దీపాలు ఆర్పి, కషాయాలు తాగి కరోనాను పారదోలవచ్చని సెలవిచ్చిన మన ప్రధానమంత్రి మొదలుకొని గల్లీ నాయకుల వరకు అబద్ధాల ప్రచారంలో సఫలీకృతులవుతున్నారు. ప్రజా రవాణా స్తంభింపజేసి దాదాపు ముప్పై కోట్ల అసంఘటిత రంగ కార్మికుల జీవితాలను ఛిద్రం చేసిన మహానుభావులు. ఏ మాత్రం ముందస్తు ప్రణాళిక లేకుండా రాత్రికి రాత్రి నిర్ణయాలు తీసుకొని ప్రజలను రోడ్డుకి ఈడ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. కరోనా విషయంలో జనతా కర్ఫ్యూ విధించి ప్రజలకు తిండి లేకుండా చేసిన ఘనత, దేశంలో దొంగనోట్లు చెలామణి, నల్లధనం ఎక్కువగా ఉందని పెద్ద నోట్ల రద్దు ప్రక్రియ చేపట్టి పూర్తిగా అభాసుపాలయ్యారు. ఈ మధ్య ఆర్బీఐ గతంలో ఎన్నడూ లేని విధంగా దొంగ నోట్ల బెడద ఉన్నదని ప్రకటించింది. మోదీ సర్కారు అండదండలతో పార్లమెంటులో బలముందని నాయకులు హద్దు మీరుతున్నారు. బీజేపీ నాయ కులు విద్వేష భావజాలాన్ని విజృంభింపచేస్తూ, పరమత సహనానికి పాతరేసి ప్రపంచం ముందు తల దించుకునేలా చేశారు. దేశంలో సమస్యలే లేవన్నట్లు హిజాబ్, హలాల్, ఆహార అలవాట్లపై, వస్త్రధారణపై, మసీదు, చర్చిలపై దాడులకు పాల్పడుతున్నారు. వాట్సాప్ విశ్వవిద్యాలయాలలో డాక్టరేట్ తీసు కున్న ఈ మేధావులు మీడియాను ఆయుధంగా చేసుకొని ప్రజలకు అజ్ఞానాన్ని ప్రసాదిస్తున్నారు. రాజకీయ నాయకులు తమకు ఇబ్బందులు ఎదురైన సందర్భాల్లో నోటికొచ్చిన అబద్ధాన్ని చెప్పి తప్పించుకుంటారు. తర్వాతెప్పుడో ఆ సంగతి రుజువైతే క్షమాపణలు చెప్పుకుని జారుకుంటారు. రాజకీయ నాయకులు బుద్ధి పూర్వకంగా అబద్ధం చెప్పడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలి. ఒక కంపెనీ ఏదైనా ఉత్పత్తిని అమ్మి దాని గురించి అబద్ధాలు చెప్తే పరిహారం పొందే హక్కు మనకు ఉంటుంది. రాజకీయాల్లో కూడా అలాగే ఉండాలి కదా. ఎవరైనా రాజకీయ నేత తన విజయాల గురించి, భావాల గురించి, చర్యల గురించి కావాలని అబద్ధం చెప్తే అందుకు తగిన మూల్యం చెల్లించాలి. ఈ విధానంలో రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని తిరిగి నెలకొల్పగలం. ప్రజాస్వామ్యానికి జవాబుదారీతనమే ప్రాణం.

ప్రభుత్వంలో నమ్మకానికి ఇదే పునాది. మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళ్లి వెంకటేశ్వర స్వామి విగ్రహమో, రాముల వారి విగ్రహమో ఇచ్చి మంచి పట్టు శాలువా కప్పి ప్రధాని, అమాత్యుల కాళ్లకు మొక్కి రాష్ట్రాలకు గ్రాంట్లు, నిధులు, రుణాలు, ఓవర్ డ్రాఫ్ట్, జీఎస్టీ ద్వారా రాష్ట్రాల వాటా, పెండింగు ప్రాజెక్టుల నెపంతో ఇడి, సీబీసీఐడీ కేసుల వివరాల గురించి పైరవీలు చేస్తూ అంతో ఇంతో సాయం పొందుతున్నారు. బీజేపీ నాయకులు మేమిచ్చే డబ్బు అపాత్ర దానాలు చేస్తున్నారు అని వ్యాఖ్యానిస్తున్నారు. డబ్బు ఎవరు ఇమ్మ న్నారు, ఇచ్చిన డబ్బు సక్రమంగా వినియోగించకపోతే కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాదా? బహిరంగ సభల్లో, ఎన్నికల ర్యాలీల్లో, ఇంటర్వ్యూల్లో, టీవీ చర్చాగోష్ఠిల్లో మాత్రమే కాకుండా సర్వదా అన్ని పరిస్థితుల్లో అలవోకగా అబద్ధాలు ఆడుతారు. ఈ విషయంలో బెరుకనేది కనిపించకుండా నిజాన్ని నిర్భయంగా చెబుతున్నట్లుగా అబద్ధాన్ని అతికినట్లు చెప్పడంలో వారికి వారేసాటి. నిజాన్ని చెప్పడంలో పొదుపు, అబద్ధాలను చెప్పడంలో విశృంఖలత పాటిస్తారు.

ప్రపంచం చూపు మన వైపా..!

డా. జ్ఞాన్ పాఠక్

భారతదేశం తమ సమస్యలను పరిష్కరించగలదని ప్రపంచంలో అత్యధిక దేశాలు మన వైపు చూస్తున్నాయి అని ప్రధాని మంత్రి నరేంద్రమోదీ అన్నారు. తన ఎనిమిదేళ్ల పాలన పూర్తయ్యాక ఆయన ఈ మాటలు చెప్పారు. ఇది హాస్యాస్పదంగా లేదూ! దేశ ప్రజల సమస్యలే తీర్చలేని వాళ్లు ఇతర దేశాల సమస్యలు ఎలా తీరుస్తారు? మోదీ ఎనిమిదేళ్ల పాలన సంబరాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ నెల 6 నుండి 11 వరకు జరుపుతోంది. ఎన్నో విజయాలను సాధించామని డాంబికాలు పలుకుతున్న మోదీ పాలనలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డిజి) సాధించటంలో పూర్తిగా వైఫల్యం చెందారు. సుస్థిర అభివృద్ధి సమాచారాన్ని పరిశీలించినప్పుడు మోదీ చెప్పినవి దేశ ప్రజలను తప్పుదారి పట్టించడానికే అని స్పష్టంగా అర్థమవుతుంది. ఎస్‌డిజి లక్ష్యాల సాధనలో ఇంతవరకు వైఫల్యం చెందటమే కాక రానున్న మరో ఎనిమిదేళ్లలోనూ సాధిస్తామన్న హామీ కనిపించడం లేదు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు రోజురోజుకీ తగ్గుతూనే ఉన్నాయి. ఇటీవల ప్రపంచ సుస్థిర అభివృద్ధి నివేదిక 2022 విడుదలైంది. ఇందులో భారతదేశం వరుసగా మూడేళ్లు సంసిద్ధత సూచిలో తక్కువ స్థాయిలో ఉన్నది. ఐక్యరాజ్య సమితి 2030 నాటికి సుస్థిర అభివృద్ధిని సాధించాలని అన్ని దేశాలను నిర్దేశించింది. అయితే ఈ లక్ష్య సాధనలో ఇతర దేశాల కంటే భారతదేశం అధ్వాన్న స్థితిలో ఉన్నది.

ఐరాస 17 ఎస్‌డిజి లక్ష్యాలను నిర్దేశించగా మన దేశం 11 అంశాలలో అత్యధిక సవాళ్లను, మూడు అంశాలలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోందని ఇటీవల విడుదల చేసిన నివేదిక తెలియజేస్తోంది. రెండు లక్ష్యాలను మాత్రం కొంత మేర సాధించగలిగింది. ఈ లక్ష్య సాధనలో పశ్చిమాసియా సగటున 65.9 పాయింట్లను సాధించగా మన దేశం 60.3 పాయింట్లనే సాధించింది. 163 దేశాల సూచీ పట్టికలో మనది 121 వ స్థానం. 2021లో మనం 120 వ స్థానంలో ఉండగా, ఈ సంవత్సరం ఒక స్థానం పడిపోయింది. అలాగే 2020లో 117వ స్థానంలో ఉండగా, ఇప్పుడు నాలుగు స్థానాలు తగ్గిపోయాయి.

ఐరాస 17 ఎస్‌డిజి లక్ష్యాలను నిర్దేశించగా మన దేశం 11 అంశాలలో అత్యధిక సవాళ్లను, మూడు అంశాలలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోందని ఇటీవల విడుదల చేసిన నివేదిక తెలియజేస్తోంది. రెండు లక్ష్యాలను మాత్రం కొంత మేర సాధించగలిగింది. ఈ లక్ష్య సాధనలో పశ్చిమాసియా సగటున 65.9 పాయింట్లను సాధించగా మన దేశం 60.3 పాయింట్లనే సాధించింది. 163 దేశాల సూచీ పట్టికలో మనది 121 వ స్థానం. 2021లో మనం 120 వ స్థానంలో ఉండగా, ఈ సంవత్సరం ఒక స్థానం పడిపోయింది. అలాగే 2020లో 117వ స్థానంలో ఉండగా, ఇప్పుడు నాలుగు స్థానాలు తగ్గిపోయాయి. ఈ నివేదికను స్వతంత్ర గ్రూపు నిపుణులు, సుస్థిర అభివృద్ధి పరిష్కార నెట్‌వర్క్ (ఎస్‌డిఎస్‌ఎన్) రూపొందించాయి. ఎస్‌డిజి లో 12వ లక్ష్యం (బాధ్యతాయుత వినిమయం, ఉత్పత్తి) 13వ లక్ష్యం (వాతావరణ చర్యలు) సాధనలో కొంత మేర పురోగతి ఉన్నది. గణనీయమైన సవాళ్లలో ముఖ్యమైనది మొదటిది పేదరికం నిర్మూలన, ఏడవది అందుబాటులో స్వచ్ఛ ఇంధనం, పదవది అసమానతల తగ్గింపు. ఈ అసమానతల తగ్గింపులో మనం అనేక దేశాల కంటే వెనుకబడి ఉన్నాం. ఆకలి శూన్యత (రెండు), మంచి ఆరోగ్యం, సంక్షేమం (మూడు), స్త్రీ, పురుష సమానత్వం (అయిదు), స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం (ఆరు), గౌరవనీయమైన పని, ఆర్థిక వృద్ధి (ఎనిమిది), పరిశ్రమలు, నూతన ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు (తొమ్మిది), సుస్థిర నగరాలు, వివిధ తరగతుల ప్రజలు (పదకొండు), నీటి లభ్యత (పద్నాలుగు), ఈ ధరిత్రిపై జీవనం (పదిహేను), శాంతి. న్యాయం బలమైన సంస్థలు (పదహారు), లక్ష్యాల సాధనలో భాగస్వామ్యం (పదిహేడు) లక్ష్యాల విషయంలో అత్యధిక సవాళ్లనే ఎదుర్కొంటున్నాం.

పేదరికంలో తలసరి వినిమయం రోజుకు 1.90 డాలర్లు కాగా, అది కొద్దిగా మెరుగవుతోంది. ఐదేళ్ల లోపు పిల్లలు కుంచించుకుపోయి పొట్టివాళ్లుగా ఉంటున్న వారి శాతం 34.7 శాతం నమోదయ్యింది. పౌష్టికాహార లోపం 15.5 శాతం ఉంది. పిల్లలకు సంబంధించి చాలా అంశాలలో లోపాలు కొనసాగుతున్నాయి. ప్రధానమైన సవాళ్లలో ప్రసూతి మరణాలు చాలాకాలంగా కొనసాగుతున్నాయి. క్షయ వ్యాధిగ్రస్థుల మరణాలు 188గా ఉంది. అలాగే గృహాలలో కాలుష్యం, బయటి వాతావరణంలో కాలుష్యం కూడా ఎక్కువగా ఉన్నది. స్త్రీ, పురుష సమానత్వ లక్ష్య సాధన ప్రధానమైన సవాళ్లలో ఒకటిగా కొనసాగుతూనే ఉంది. స్త్రీ, పురుష సమానత్వం అంటే విద్య, పనులలో పాల్గొనటం, చట్ట సభలలో సభ్యత్వం తదితర అంశాలు వస్తాయి. ఈ విషయంలోనూ పెద్దగా పురోగతి సాధించలేదు. స్వచ్ఛమైన నీరు, పారిశుధ్య లక్ష్య సాధనలోను వెనుకబడే ఉన్నాం. ఇంకా గౌరవనీయమైన పని, ఆర్థిక వృద్ధి లక్ష్యంలోను ముందడుగు వేయలేదు. కార్మికుల హక్కులకు హామీ అధ్వాన్న స్థితిలో ఉన్నది. పరిశ్రమల స్థాపన, నూతన ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలలో కేంద్ర ప్రభుత్వం పని విధానం అధ్వాన్నంగా ఉన్నది. దేశంలో నగరాల పరిస్థితి ఎంతమాత్రం మెరుగుపడలేదు. మురికివాడలు, కాలుష్యం, ప్రజల జీవన విధానం తదితర అనేక అంశాలలో ఎంత మాత్రం పురోగతి లేదు.

ఇ-మెయిల్

పది ఫలితాలెందుకు తగ్గాయి?

రాష్ట్రంలో వెల్లడైన పదవ తరగతి ఫలితాల్లో 67 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కరోనా వల్ల గడచిన రెండేళ్లు పరీక్షల నిర్వహణ జరగలేదు. ఈ ఏడాదే మళ్ళీ జరగడం. ఉత్తీర్ణతా శాతం కరోనా రాకముందు ఏటేటా 90 శాతానికి పైనే ఉండేది. అయితే ఈసారి ఇలా తక్కువగా నమోదు కావడం ఊహించని విషయమేమీ కాదు. విద్యార్థుల చదువుపై మహమ్మారి చూపిన దుష్ప్రభావాన్ని ఈ ఫలితాలు సరిగ్గా ప్రతిబింబించాయి. ఈ స్థితి నుండి వీలైనంత త్వరగా బయటపడేలా అన్ని వైపులా కృషి జరగాల్సి ఉంది. కరోనా సమయంలో స్కూళ్ళు తెరవలేదు. పాఠాల్ని కొద్దిగానో గొప్పగానో ఆన్‌లైన్ విధానంలో జరిపే ప్రయత్నం జరిగింది. అయితే అది ప్రత్యక్ష క్లాస్ రూమ్ విధానానికి ఏ విధంగానూ సాటి కాదు. పైగా విద్యార్థులందరికీ కంప్యూటర్, అంతర్జాలం అందుబాటులో ఉండవు. అలా అందుబాటులో ఉన్నవారు 20 శాతం కూడా ఉండరు. ఆ అవకాశం ఉన్న వాళ్ళు కూడా పాఠాలపై పూర్తి శ్రద్ధ పెట్టే అవకాశం తక్కువ. ఇతర విషయాల జోలికి వెళ్లే అవకాశాలు ఎక్కువ. ఇంట్లో కూడా కరోనా ప్రభావంతో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులు, సరైన పోషకాహారం దొరకకపోవడం లాంటివి కూడా తక్కువేమీ కాదు. ఇవన్నీ తోడై విద్యార్థి ఆందోళన, మానసిక ఒత్తిడిని పెంచాయి. బుద్ధిగా, ప్రణాళికాబద్ధంగా చదువుకునే వీలు లేకుండా పోయింది. మరోవైపు స్కూల్ మధ్యలో మానేసిన వారు పెరిగారు. విద్యపై వివిధ కోణాల్లో పడిన ఈ దుష్ప్రభావాల ఫలితమే ఉత్తీర్ణత తగ్గడానికి మూల కారణం. ఇప్పుడు విద్యని తిరిగి

గాడిలో పెట్టడానికి పెద్ద ప్రయత్నమే జరగాలి. ముఖ్యంగా ఉపాధ్యాయుల బాధ్యత ఇప్పుడు రెట్టింపు అయ్యింది. ప్రతీ విద్యార్థిపై వారు ప్రత్యేక వ్యక్తిగత శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. వారికి చదువుతో బాటు స్థైర్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. పరిస్థితులు మళ్ళీ పట్టాలెక్కే వరకూ ప్రభుత్వం ఉపాధ్యాయుల్ని బోధనకే పరిమితం చెయ్యాల్సి ఉంటుంది. వేరే అదనపు బాధ్యతల నుండి తాత్కాలికంగానైనా తప్పించాలి. మన రాష్ట్రమనే కాదు. యావత్ ప్రపంచంపై ఉన్న సవాలు. కరోనా ప్రభావంతో దిగజారిన విద్యాప్రమాణాల్ని సరిచెయ్యడం అవసరం.

– డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, 9440836931.

పౌర సమాజమా... దుశ్శాసన పర్వాలపై జ్వలించవేమి?

తిప్పినేని రామదాసప్పనాయుడు

ఆనాటి ప్రత్యూష...మొన్నటి ఆయేషా...నిన్నటి నిర్భయ, అభయ, దిశల నుంచి నేటి బంజారాహిల్స్ మైనర్ బాలిక వరకు ఎన్నో.. ఎన్నెన్నో... పాశ్చాత్యుల సంస్కృతి భోగ సంస్కృతి-భారతదేశ సంస్కృతి త్యాగ సంస్కృతి అని అప్పట్లో స్వామి వివేకానంద మన దేశ ఔన్నత్యాన్ని, విలువలను ప్రపంచ వ్యాప్తంగా ఎలుగెత్తి చాటారు. ఈ నేపథ్యంలో అనేకమంది విదేశీయులు మన దేశ మహిళల సాంప్రదాయాలను, కట్టుబొట్టును అనుకరిస్తూ.. అమితంగా గౌరవించడం రానురాను పరిపాటిగా మారింది. మన కుటుంబ వ్యవస్థ గురించి, మహిళలకు మనమిచ్చే గౌరవం, ప్రేమాభిమానాల గురించి ప్రపంచ దేశాలలో కథలు కథలుగా చెప్పుకుంటారు. ఇలా... మన పేరు బయట గొప్పగా వుండగా ఈ మధ్య జరుగుతున్న వరుస ఘటనలను చూస్తుంటే... అత్యాచారాల భారతం, రేపిస్టుల ఇండియా ఆవిష్కృతమవుతుందేమోనని ఆందోళన వ్యక్తమవుతున్నది. పి.వి.నరసింహారావు భారత ప్రధానమంత్రిగా వున్నప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో ఓ యువజన కాంగ్రెస్ నాయకుడు తన ప్రియురాలిని ఓ తందూరీ (డాబాలోని పొయ్యి)లో వేసి కాల్చి చంపాడు. ఆ ఘటనకు చలించిన పి.వి. యూత్ కాంగ్రెస్ కార్యకలాపాల మీద నాకు ఓ నివేదిక కావాలని అటు ప్రభుత్వానికి, ఇటు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. 2002లో వర్ధమాన సినీనటి ప్రత్యూష లైంగిక దాడి, హత్యకు గురైంది. ఈ ఘటన వెనుక ప్రముఖుల పుత్రరత్నాలు వున్నారని హైదరాబాద్ నగరం కోడై కూసింది. చివరకు అత్యున్నత స్థాయి దర్యాప్తు సంస్థ సైతం అసలైన పాత్రధారులను వదిలేసి ఒకే ఒక సూత్రధారిని మాత్రమే పట్టుకుంది. వాస్తవంగా ప్రత్యూష ప్రేమికుడైన సిద్ధార్థ రెడ్డి పిలిచిన చోటుకి అతని మీద నమ్మకంతో, ప్రేమతో, గౌరవంతో ఒంటరిగా వెళ్లింది. అప్పటికే.. అతడు పన్నిన వ్యూహంలో భాగంగా నాటి రాష్ట్ర మంత్రి కుమారునితో పాటు మరొకరు అక్కడ వున్నారు. వారి కీచక పర్వానికి ఆమె బలైపోయింది. దర్యాప్తు సంస్థ తప్పు కేవలం సిద్ధార్థ రెడ్డిది మాత్రమేనని పేర్కొంది. అతనికి ఆ తరవాత శిక్ష కూడా పడింది. ఆ కీచకుల వీర్యపు చుక్కలు వున్న ప్రత్యూష వస్త్రాలను డాక్టర్లు లేదా పోలీసులు కాల్చివేశారని కూడా అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఇలా దర్యాప్తులో అసలు ఆధారాలను తారుమారు చేయడం బలిసిన పెద్దలకు మామూలేనని సరిపెట్టుకోవలసివచ్చింది. వై.యస్.రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో బీఫార్మసీ విద్యార్థిని అయేషా తాను వుంటున్న హాస్టల్‌లోనే లైంగికదాడికి గురై మరణించింది. ఇది పూర్తిగా నూరుశాతం హత్యాచార నేరం. ఇక్కడ కూడా ఓ మంత్రి మనవడి ప్రమేయం వుందని ఆరోపణలు వచ్చాయి. దివ్యాంగుడైన సత్యంబాబు అనే అమాయకుడిని ఈ కేసులో అరెస్ట్ చేశారు. ఆ సత్యం బాబు తల్లి హైకోర్టు వరకు వెళ్లి మూడు నాలుగు సంవత్సరాలు పోరాడగా సత్యం బాబును నిర్దోషిగా తేలుస్తూ సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఘటన జరిగిన కొన్ని రోజులకే అప్పట్లో జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ ఆయేషా వున్న హాస్టల్‌ను సందర్శించి వార్డెన్ చెంప మీద చెళ్లుమని కొట్టింది. ఇలా అప్పుడు జాతీయ సంస్థలు వచ్చినా... అసెంబ్లీలో ప్రతిపక్షాలు అరిచి గీపెట్టినా అసలు నిందితుడు దొరకలేదు. అమాయకుడు బలి పశువయ్యాడు. 2012లో ఢిల్లీలో చోటుచేసుకున్న నిర్భయ ఘటన యావత్ దేశాన్ని కుదిపేసింది. ఆ తరవాత హైదరాబాద్‌లో అభయ ఘటన జరిగింది. 2019లో ఇదే హైదరాబాద్ శివారునందు దిశ దుర్ఘటన పట్ల కూడా యావత్ భారతదేశం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది కిందట అనంతపురంలో ఓ దళిత యువతిని ప్రేమిస్తున్నానని చెప్పిన ఓ యువకుడు అతని స్నేహితులు హత్యచేశారు. ఆ తరవాత గుంటూరులో తనను ప్రేమించలేదనే కారణంతో నడిరోడ్డు మీద పట్టపగలు రమ్య అనే యువతిని మరో దుర్మార్గుడు కత్తితో పొడిచి చంపాడు. గత నెలలో రేపల్లె రైల్వే స్టేషన్‌నందు ఓ గృహిణిపై సామూహిక లైంగికదాడి చేశారు. ఈ మధ్యనే విజయనగరంలో ఒక యువతి, సత్యసాయి జిల్లా గోరంట్లనందు మరో యువతి మరణించారు. దిశ ఘటన జరిగన రోజులలోనే అదిలాబాద్ జిల్లాలో ఓ దళిత మహిళపై ఒక ప్రత్యేక సామాజిక వర్గానికి చెందిన వారు హత్యాచారానికి పాల్పడ్డారు. ఐదు సంవత్సరాల కిందట ఉత్తర తెలంగాణలో మరో దళిత యువతి ఈ విధంగానే తనువు చాలించింది. గత సంవత్సరం డిసెంబర్‌లో సూర్యాపేట జిల్లాలో ఓ గిరిజన యువతి సామూహిక లైంగిక దాడికి గురై ఆసుపత్రిలో చేరి ఆ తరవాత మరణించింది. రెండేళ్ళ క్రితం శ్రీనివాసరెడ్డి అనే కామాంధుడు హైదరాబాద్ నగరానికి ముప్పై కిలోమీటర్ల దూరంలో వున్న గ్రామంలో వరుసగా మూడు నాలుగు సంవత్సరాలు ఓ ఐదారుమంది మైనర్ బాలికలను రేప్ చేసి బావిలో పడేశాడు. మే మొదటి వారంలో హైదరాబాద్ నగరానికి నలభై కిలోమీటర్ల దూరంలో వున్న చౌటుప్పల్ నందు ఒక గిరిజన మహిళ మీద మరో మృగాడు హత్యాచారం చేశాడు. ఈ వారంలో హైదరాబాద్ నగరం నడిబొడ్డున కారులో పట్ట పగలు అత్యాచారానికి గురైన మైనర్ బాలిక ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇందులో ప్రజా ప్రతినిధుల కుమారులూ నిందితులుగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రెండు సంవత్సరాల కిందట ఎమ్మెల్యే కుటుంబం వల్ల అత్యాచారానికి గురైన మరో బాలిక కుటుంబంలో యావన్మంది రకరకాల కోణాలలో మరణించారు. భాగ్యనగరంలో మైనర్ బాలిక ఘటన గురించి నిత్యం చర్చ జరుగుతుండగా... పాత బస్తీలో మరో యువతిపై, నక్లెస్ రోడ్డులో కారులో ఇంకో యువతిపై కామాంధులు లైంగికదాడికి ఒడిగట్టారు. ఇవన్నీ వెలుగులోకి వచ్చిన అతి కొద్ది ఘటనలు మాత్రమే. వెలుగులోకి రాని రైలు పట్టాల మీద పడి ఉన్న మహిళల శవాలు, గుర్తు తెలియని మహిళల శవాలు మరెన్నో వున్నాయి. మొత్తం మీద తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ప్రతిరోజూ అనేక చోట్ల పదుల సంఖ్యలో అత్యాచారాలు, హత్యాచారాలు జరుగుతున్న మాట యథార్థం. నిర్భయ ఘటన జరిగిన కొన్ని రోజులకు ఢిల్లీ పరిసర ప్రాంతంలోనే మైనర్ బాలిక హత్యాచారానికి గురైంది. ఈ ఘటనలో నిర్భయ దారుణాన్ని ఖండించిన విధంగా పౌరసమాజం ఎందుకు స్పందించలేదని సాక్షాత్తు సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్భయ, దిశ, బంజారాహిల్స్ మైనర్ బాలికల ఘటనల తరహాలో పౌరసమాజం అన్ని సందర్భాలలోనూ స్పందించడం లేదు. ప్రజలు, ప్రతి పక్షాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, మీడియా మూకుమ్మడిగా స్పందించిన ఘటనలు మాత్రమే యావత్ సమాజాన్ని, దేశాన్ని కుదిపేస్తు న్నాయి. అది కూడా కొన్ని రోజులు మాత్రమే. ఈ విధంగా వ్యవస్థలు స్పందించని దృశ్యాలు, దుశ్శాసన పర్వాలు, దారుణ దృష్టాంతాలు వేలల్లో వున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఐదారు సంవత్సరాల చిన్నారుల మీద, మతి స్థిమితం లేని మహిళల మీద కూడా లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యాచారాలు జరుగుతుంటే ఈ సమాజం ఎటు వైపు పోతున్నదోనని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ఈ దారుణ మారణ కాండలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గం కోసం యావత్ మానవాళి ఒక తాటి మీదకు రావలసి వుంది.

వ్యాస రచయిత ముద్ర అగ్రికల్చర్ & స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఛైర్మన్

యూపీలో రెచ్చిపోతున్న కాషాయ మూకలు

- ముస్లిం ఫకీర్లకు వేధింపులు, బెదిరింపులు
- జిహాదీలు, ఉగ్రవాదులుగా నిందలు
- వీడియో వైరల్ - ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలపై దురాగతాలు ఆగడం లేదు. తాజాగా ముగ్గురు ముస్లిం ఫకీర్ల (సన్యాసులు)ను కొందరు హిందూత్వవాదులు వేధించారు. బెదిరింపులకు పాల్పడ్డారు. ఆధార్ చూపాల్సిందేనని లేనిపక్షంలో చావగొడతామని హెచ్చరించారు. వారిని ఉగ్రవాదులు.. జిహాదీలు అంటూ దూషించారు. ఎక్కడికి వెళ్లినా ఆధార్ వెంట తీసుకెళ్లాల్సిందే అంటూ హుకుం జారీ చేశారు. ముగ్గురు ఫకీర్లతో బలవంతంగా గుంజీలు తీయించడమే కాకుండా వారితో జై శ్రీరామ్ అని నినాదాలు చేయించారు. ఇదంతా యూపీలోని గోండా ప్రాంతంలోగల దేగూరు గ్రామంలోచోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. వీళ్లు సాధువుల వస్త్రధారణలో ఉంటారుగానీ ఈ డబ్బుతో బిర్యానీ తింటారని ఫకీర్లనుద్దేశించి ఓ వ్యక్తి అనగా.. గుర్తింపు కార్డులు చూపాలని పెద్ద కర్రతో మరొక వ్యక్తి బెదిరించడం, గుర్తింపు కార్డులు లేవని ఫకీర్లు చెప్పగా వారిని జిహాదీలు, ఉగ్రవాదులు అంటూ దూషిస్తుండటం వీడియోలో ఉంది. వీడియోలో కనిపించే ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కాన్పూర్‌లో మరొక ఘటన చోటుచేసుకుంది. ఓ పేద ముస్లిం దుకాణదారుడిని తుషార్ శుక్లా అనే వ్యక్తి వేధింపులకు గురిచేశాడు. శుక్లా... హిందూ సహకార కమిటీ యువ మోర్చా అధ్యక్షుడు. రోడ్డుపై వస్త్రాలు అమ్ముకునే ముస్లిం వ్యక్తిని వ్యాపారం చేసుకోనివ్వలేదు. దీంతో పోలీసులు అతనిని అరెస్టు చేశారు.

ముస్లింలపై విష ప్రచారాన్ని ఆపండి

మోదీకి నటుడు నసీరుద్దీన్ షా వినతి



న్యూఢిల్లీ : దేశంలో ముస్లింలపై విద్వేషం పేట్రేగిపోతోందని ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షా అన్నారు. తాజా పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధాని జోక్యంతోనే పరిస్థితి చక్కబడుతుందని, ముస్లింలపై విద్వేష/విష ప్రచారాన్ని ఆపాలని ఆయనకు విన్నవిస్తున్నట్లు ఓ ప్రముఖ వార్తాఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నసీరుద్దీన్ షా అన్నారు. ప్రవక్త మహమ్మద్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కనీసం తన జీవిత కాలం ముగిసేలోగా ముస్లింలపై విష ప్రచారానికి తెరపడగలదని ఆకాంక్షించారు. విజ్ఞులు, సామాజిక స్పృహగల హిందువులు ఇప్పటికైనా ముస్లింల పక్షాన నిలచి వారిపై విద్వేషాన్ని వ్యతిరేకించాలన్నారు. శాంతి, ఐక్యత వంటి అంశాల గురించి మాట్లాడితే ఏడాది పాటు జైలుకు పంపుతారు అదే మారణహోమం గురించి మాట్లాడితే చేతిపై చిన్న దెబ్బ వేసి వదిలేస్తారు. ఇది ద్వంద్వ వైఖరి కాక మరేమిటి అంటూ కేంద్రప్రభుత్వ తీరునుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజలకు 'మతమౌఢ్య' విషాన్ని నూరిపోస్తున్నారని, దీనిని ఆపకపోతే తర్వాత తీవ్ర పరిణామాలు తప్పబోవని హెచ్చరించారు. తమ పార్టీ నేతలు ప్రవక్తను అవమానిస్తే 'ఫ్రింజ్ ఎలిమెంట్' అంటూ తోసిపుచ్చే ప్రయత్నం ఎంత వరకు సమంజసమని బీజేపీని ప్రశ్నించారు. అదే పాకిస్తాన్, అఫ్ఘాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ఇలా జరిగివుంటే దైవదూషణ నేరం కింద ఉరికంబం ఎక్కించేవారని నసీరుద్దీన్ షా అన్నారు. కోట్లాది మంది ముస్లింల మనోభావాలను దెబ్బతీసి.. ప్రవక్తను కించపరిచితే దేశంలోని మిగతా వర్గీయులకు కనీసం చీమ కుట్టినట్లయినా లేదే అని ఆందోళన వ్యక్తంచేశారు. కేవలం పార్టీ నుంచి సస్పెండ్ చేయడం, నుపూర్ శర్మ ఏదో కంటితుడుపుగా నిజాయితీ లేకుండా క్షమాపణ చెప్పడం ఎందుకని ప్రశ్నించారు. ఇదే కొనసాగితే మరోసారి విద్వేష వ్యాఖ్యలు వినిపించినా ఆశ్చర్యం లేదన్నారు. ప్రజల్లో పరిస్థితుల్లో మార్పు రాకపోతే చర్చీల్లోనూ శివలింగాల వేట మొదలు కావడానికి ఎంతో సమయం పట్టబోదన్న అభిప్రాయాన్ని షా వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కబెట్టాలని, ముస్లింలపై విద్వేషానికి, విష ప్రచారానికి ముగింపు పలకాలని నసీరుద్దీన్ షా కోరారు.

ఇది భిన్నత్వాన్ని అనుమతించని ప్రభుత్వం: చిదంబరం

న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని 'భిన్నత్వాని అనుమతించని ప్రభుత్వం'గా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం అభివర్ణించారు. పర్యావరణ సంరక్షణ సూచీ(ఈపీఐ)ని తిరస్కరించిన నేపథ్యంలో చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాటలకు అనుగుణంగా ప్రపంచం నర్తించదన్న విషయాన్ని మోదీ ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఇప్పటివరకు 'సమాచారం అందుబాటులో లేదు' ప్రభుత్వంగా ప్రసిద్ధి చెందింది. ఇప్పుడు అది 'భిన్నత్వాన్ని అనుమతించని ప్రభుత్వం' అని చిదంబరం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అందుకే 180 దేశాల్లో భారత్‌ను చివరి స్థానంలో నిలిపిన పర్యావరణ పనితీరు సూచీని కేంద్రం తిరస్కరించిందని తెలిపారు. దేశంలో కోవిడ్ మరణాల సంఖ్యపై డబ్ల్యూహెచ్‌ఓ నివేదికతో పాటు గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను గతంలో కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని ఆయన గుర్తు చేశారు. బీజేపీ/ఆర్‌ఎస్‌ఎస్ పాటలకు ప్రపంచం నర్తించదని మోదీ ప్రభుత్వం గ్రహించాలని చిదంబరం ఎద్దేవా చేశారు.

13 వరకు ఈడీ కస్టడీకి జైన్

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ఆరోగ్యశాఖమంత్రి సత్యేంద్ర జైన్‌ను మరో నాలుగు రోజులు ఈడీ కస్టడీకి స్థానిక కోర్టు గురువారం అనుమతించింది. జైన్‌ను మరో ఐదురోజులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక జడ్జి గీతాంజలి గోయల్ జూన్ 13 వరకు కస్టడీకి అనుమతించారు. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు ఈడీ తరపున వాదిస్తూ ఇప్పటి వరకూ జైన్ కస్టడీ సమయంలో అనేక ప్రాంతాల్లో ఈడీ తనిఖీలు నిర్వహించిందని, నగదు, పత్రాలు సహా అనేక ఆధారాలు లభ్యమయ్యాయయని, మరింత విచారణ కోసం జైన్‌కు మరో ఐదురోజుల కస్టడీ పొడిగించాలని కోర్టుకు విన్నవించారు.

ఆ పత్రాల గురించి జైన్‌ను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. జైన్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ ఈడీ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. ఇప్పటికే జైన్ ఈడీ కస్టడీలో ఉన్నారని, కస్టడీని మరింత కాలం పొడిగించాల్సిన అవసరం లేదని కోరారు.

నుపుర్‌శర్మపై కేసు కోసం ముస్లింల ఒత్తిడి

ముంబై: మహ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన బీజేపీ నేత నుపుర్ శర్మపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి..అరెస్టు చేయాలని ముస్లింల ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. నుపుర్‌శర్మపై మహారాష్ట్రలోని థానె జిల్లా అంబర్‌నాథ్ పోలీసు స్టేషన్‌లో ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ముస్లిం వెల్ఫేర్ కమిటీ మంగళవారం ఫిర్యాదు చేసిందని అధికారి ఒకరు చెప్పారు. ఇప్పటి వరకు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని, ఫిర్యాదుపై విచారణ జరుగుతోందని, తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. జూన్ 22న తమ ముందు హాజరు కావాలని శర్మకు థానె పోలీసులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. నుపుర్ శర్మ వాంగ్మూలాన్ని నమోదు చేస్తారు. ముంబై పోలీసులు సైతం మే 28న నుపుర్‌శర్మపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారు.

రంజుగా రిసార్ట్ రాజకీయం

- రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు చేజారకుండా
- రాజస్థాన్‌లో కాంగ్రెస్, బీజేపీల ఏర్పాట్లు

ఉదయ్‌పూర్ : రాజస్థాన్‌లో రిసార్టు రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. ఈ నెల 10న జరుగనున్న నాలుగు రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీల అభ్యర్థులు చేజారకుండా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పార్టీలు రిసార్టు రాజకీయాలకు తెరలేపాయి. కేంద్రంలోని అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ పార్టీ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేసే అవకాశం ఉందని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ తమ 108 మంది ఎమ్మెల్యేలు సహా తమకు మద్దతుగా ఉన్న స్వతంత్రులను ఈనెల 2వ తేదీనే ఉదయ్‌పూర్‌లోని తాజ్ ఆరావళి రిసార్ట్‌కు తరలించింది. అక్కడ వారికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసినట్టు సోషల్ మీడియాలో వస్తున్న వీడియోల్లో స్పష్టమవుతోంది. ఎమ్మెల్యేల కోసం జిమ్, ఈత కొలను, క్రికెట్ సహా అన్ని రకాల క్రీడలు, సినిమాలు, ప్రముఖ మెజీషియన్‌లతో మ్యాజిక్ షోలను ఏర్పాటు చేసి వారిని తమ చేతుల్లోంచి జారిపోకుండా చూసుకుంటున్నట్టు తెలుస్తోంది. మహిళా ఎమ్మెల్యేలు అంత్యాక్షరి తదితర పోటీల్లో పాల్గొన్నట్టు కొన్ని వీడియోలు ప్రచారమయ్యాయి. ఈ రిసార్టులో సోమవారం సాయంత్రం ప్రముఖ మెజీషియన్ ఆంచల్ నిర్వహించిన మ్యాజిక్ షోకు సీఎం అశోక్ గెహ్లాట్ కూడా హాజరైనట్టు ఒక ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గోవింద్ సింగ్ దోతస్రా నిత్యం వారికి అందుబాటులో ఉంటూ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 10 తేదీన పోలింగ్ ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా గురువారం మధ్యాహ్నం చార్టర్డ్ విమానంలో ఉదయ్‌పూర్ నుంచి జైపూర్ చేరుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై స్పందించిన కాంగ్రెస్ నేత ఒకరు మాట్లాడుతూ తమ పార్టీ ఎమ్మెల్యేల బలంతో పాటు స్వతంత్ర ఎమ్మెల్యేలు సహా మరి కొందరు తమకు మద్దతు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో తమకు 126 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండడంతోనే ముగ్గురు అభ్యర్థులను బరిలో నిలిపినట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బీజేపీ కూడా ఇదే తరహాలో తమ పార్టీకి చెందిన 71 మందిని జైపూర్‌లోని ఒక హోటల్‌కు తరలించింది. వారికి కావలసిని అన్ని రకాల ఏర్పాట్లతో పార్టీ క్రమశిక్షణా శిబిరం అనే పేరు పెట్టి ఎమ్మెల్యేలు పక్కచూపులు చూడకుండా బంధించినట్టు తెలుస్తోంది.

పంకజాముండే మద్దతుదారులు అరెస్టు

ఔరంగాబాద్: మహారాష్ట్ర మాజీమంత్రి పంకజా ముండేను రాష్ట్ర శాసనమండలికి పంపరాదన్న బీజేపీ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు ఇక్కడి పార్టీ కార్యాలయానికి వెళుతున్న ముగ్గురు మద్దతుదారులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఔరంగాబాద్‌లోని ఉస్మాన్‌పురా ప్రాంతంలో ఉన్న బీజేపీ కార్యాలయం వైపు వెళుతూ... వారు ముండేకు మద్దతుగా నినాదాలు చేశారు. ఉస్మాన్‌పురా పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ... వారు నినాదాలు ఆపకపోవడంతో, తాము వారిని అదుపులోకి తీసుకొని వేదాంత్ నగర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. నిరసనకారులకు పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయాలనే ఉద్దేశం ఏమైనా ఉందా అనేది విచారణలో తేలుతుందని చెప్పారు.పోలీసులు తీసుకువెళుతున్నప్పుడు... ముండే మద్దతుదారుల్లో ఒకరు, మాజీ మంత్రికి అన్యాయం జరుగుతోంది...దీనిపై ఓబీసీలు బీజేపీకి సమాధానం చెబుతారని పేర్కొన్నారు. మహారాష్ట్ర శాసనమండలిలోని 10 స్థానాలకు జరగనున్న ఎన్నికలకు ఐదుగురు అభ్యర్థులను బీజేపీ బుధవారం ప్రకటించింది. అయితే బీజేపీ అగ్రనేత దివంగత గోపీనాథ్ ముండే కుమార్తె, మాజీ మంత్రి పంకజా ముండే పేరు జాబితాలో లేదు. 2019 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీకి చెందిన ఆమె బంధువు ధనంజయ్ ముండే చేతిలో ఓడిపోయిన పంకజా ముండేని పార్టీ మండలికి నామినేట్ చేయవచ్చని గతంలో ఊహాగానాలు వచ్చాయి. కాగా పంకజా ముండే అభ్యర్థిత్వం కోసం తాను, పార్టీ సీనియర్ నాయకుడు దేవేంద్ర ఫడ్నవిస్ ప్రయత్నించామని, అయితే పార్టీ కేంద్ర నాయకత్వం ఆమె కోసం కొన్ని ఇతర ప్రణాళికలను కలిగి ఉన్నట్లు కనిపిస్తోందని మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రకాంత్ పాటిల్ పేర్కొన్నారు.

మూసేవాలా హత్య కేసు నిందితుడు సిద్ధేశ్ కాంబ్లేను ప్రశ్నించిన ముంబై పోలీసులు

ముంబై : పంజాబ్ గాయకుడు మూసేవాలా హత్య కేసులో అరెస్టయిన సిద్ధేశ్ కాంబ్లేను సినీనటుడు సల్మాన్ ఖాన్‌కు వచ్చిన బెదిరింపు కేసులో ముంబై క్రైం బ్రాంచి పోలీసులు విచారించారు. మూసేవాలా హత్యలో కీలక నిందితుడని భావిస్తున్న గ్యాంగ్‌స్టర్ విష్ణోయ్ గ్యాంగ్‌తో సిద్ధేశ్ కాంబ్లేకు సంబంధాలుండడంతో ఆయన్ను బుధవారం పూణలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

కాగా సినీనటుడు సల్మాన్ ఖాన్ అతని తండ్రి సలీంఖాన్‌లను చంపేస్తామని అందిన బెదిరింపు లేఖకు సంబంధించి నమోదైన కేసులో సిద్ధేశ్ పాత్ర ఉందనే అనుమానంతో ముంబై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైం) సంగ్రామ్‌సింగ్ నిషాందర్ పర్యవేక్షణక్షణలోని పోలీసుల బృందం పూణేలోని క్రైం బ్రాంచ్ కార్యాలయానికి చేరుకుని కాంబ్లేను విచారించింది. సల్మాన్‌ఖాన్, అతని తండ్రిని చంపేస్తామని వచ్చిన బెదిరింపు లేఖకు సంబంధించిన అంశాలపై కాంబ్లేను ప్రశ్నించినట్టు అధికారులు తెలిపారు. సల్మాన్ ఖాన్, సలీం ఖాన్‌లు ఆదివారం మార్నింగ్ వాక్ పూర్తి చేసుకుని బాంద్రా వద్దనున్న ఒక బెంచ్‌పై కూర్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వారిని చంపేస్తామని రాసిన ఒక లేఖను ఉంచి పరారయ్యాడు. దీనిపై సల్మాన్ ఖాన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగానే సిద్ధేశ్‌ను విచారించారు.

గ్లాస్గోవ్ విశ్వవిద్యాలయంలో.. మజుందార్-షా పరిశోధన కేంద్రం ప్రారంభం

బెంగళూరు : బెంగళూరులోని గ్లాస్గోవ్ విశ్వవిద్యాలయంలో మజుందార్-షా పేరుతో అత్యాధునిక పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ సర్ డేవిడ్ మాక్‌మిలన్ బుధవారం ఈ కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించినట్టు వర్సిటీ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. వర్సిటీలో ఏర్పాటైన ఈ పరిశోధన కేంద్రం సృజనాత్మక పరిశోధనలకు వేదిక కానున్నట్టు పేర్కొంది. మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నూతన పరిశోధనలకు ప్రేరణగా ఉంటుందని తెలిపింది. ఈ పరిశోధన కేంద్రం నిర్మాణం కోసం వర్సిటీ పూర్వ విద్యార్థులైన బెంగళూరుకు చెందిన బయోకాన్ మాజీ వైస్ చైర్మన్ జాన్ షా, బయోకాన్ అండ్ బయోకాన్ బయోలాజిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మజుందార్-షా లు 7.5 మిలియన్లు ఆర్థిక సహకారం అందించినట్టు తెలిపింది. ఇదిలా ఉండగా భవన నిర్మాణం, పరిశోధన కేంద్రంలో ఒక ప్రొఫెసర్ నియామకానికి నిధులు ఇవ్వడం తమకు ఆనందాన్ని ఇచ్చిందని దాతలు తెలిపారు. మజుందార్-షా పరిశోధన కేంద్రం ప్రత్యేకమైన పరిశోధనలకు వేదిక అవుతుందని తాము ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆ బీజేపీ నేతలను అరెస్టు చేయాలి: మమత

కోల్‌కతా: ప్రవక్త మహ్మద్‌పై బీజేపీ నాయకులు ఇద్దరు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలను విద్వేష ప్రసంగంగా ఆమె అభివర్ణించారు. బీజేపీ నేతలిద్దరినీ తక్షణమే అరెస్టు చేయాలని, అప్పుడే దేశ సమైక్యతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మమత డిమాండ్ చేశారు. బీజేపీ నేతల వ్యాఖ్యలు హింసను ప్రేరేపించడమే కాకుండా సామాజిక విభజనకు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి కవ్వింపులకు పాల్పడినా ప్రశాంతంగా ఉండాలని అన్ని మతాలు, కులాలు, వర్గాలకు మమత విజ్ఞప్తి చేశారు. 'ఇటీవల కొంతమంది బీజేపీ నాయకులు చేసిన హీనమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు హింసను ప్రేరేపించడమే కాకుండా ప్రజల మధ్య విభజనకు కారణమవుతాయి. చివరికి దేశంలో శాంతి, సామరస్యతకు భంగం వాటిల్లుతుంది' అని మమత వరుసగా ట్వీట్లు చేశారు. దేశ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా శాంతియుతంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అదేసమయంలో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు మోదీ సర్కారు దగా: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రైతులను మోదీ సర్కారు దగా చేసిందని కాంగ్రెస్ పార్టీ గురువారం విమర్శించింది. 2022-23 ఖరీఫ్ పంటలకు సంబంధించి కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేనని మండిపడింది. ద్రవ్యోల్బణం రేటుకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించింది. రైతుల ఆదాయం పెంచడానికి బదులుగా మోదీ సర్కారు వారి బాధలను వంద రెట్లు పెంచిందని కాంగ్రెస్ ముఖ్య అధికారి ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అనేక పంటలకు పెంచిన ఎంఎస్‌పీ చార్టును ఆయన షేర్ చేశారు. మోదీ ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధర కన్నా ద్రవ్యోల్బణం అధికంగా ఉందని వ్యాఖ్యానించారు. 'మోదీ ప్రభుత్వం మద్దతు ధర పెంపునకు సంబంధించిన డొల్లతనం బహిర్గతమైంది. మద్దతు ధర ప్రకటించడంలో దేశ రైతులను మోదీ సర్కారు మరోసారి దగా చేసింది. ఇది రైతుల ఆదాయం పెరగడం కన్నా వారి బాధలు వందలరెట్లు పెంచింది' అని ఓ ప్రకటనలో సూర్జేవాలా విమర్శించారు. ఓ వైపు కనీస మద్దతు ధరకు ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయడం లేదు. మరోవైపు, ఇన్‌పుట్ వ్యయాన్ని పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని సగానికి తగ్గించిందని ఆరోపించారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

నారాయణపూర్/బిజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత రెండు జిల్లాల్లో ముగ్గురు మావోయిస్టులు లొంగిపోగా, మరో కేడర్ వ్యక్తిని భద్రతా దళాలు అరెస్టు చేసినట్టు బస్తర్ రీజియన్ అధికారులు గురువారం తెలిపారు. వారిని రమేశ్ మోహన్‌దా(25), రాజేశ్ కుమార్ మోహన్‌దా (26), సాధు పల్లో అలియాస్ మహేశ్ ముగ్గురూ నారాయణపూర్ సీనియర్ పోలీసులు, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సెస్ అధికారుల ఎదుట గురువారం లొంగిపోగా, రాములు దుర్గం(36)ను బిజాపూర్ జిల్లాలో అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. లొంగిపోయిన ముగ్గురూ కేడర్‌లోని వారికి రేషన్, మందులు, ఇతరాలను అందిస్తూ ఉంటారని, తాము మారిపోయామని, లొంగిపోతామని చెప్పినట్టు నారాయణపూర్ ఎస్పీ సదానంద్ కుమార్ తెలిపారు. రమేశ్ జతులూర్ స్థానిక సంస్థలో ఉత్సాహంగా పాల్గొంటారని, మిగిలిన ఇద్దరూ జాన్‌మిలిటియా సభ్యులని ఆయన తెలిపారు. సీనియర్ల వేధింపులు ఎక్కువవుతున్న కారణంగానే తాము లొంగిపోయినట్టు వారు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు తమకు నచ్చి లొంగిపోతున్నామన్నారు. అయితే ప్రభుత్వం తరపున లొంగుబాటు చర్యల్లో వచ్చే ప్యాకేజీని వర్తింపజేస్తామని అధికారులు తెలిపారు.

నవాబ్ మాలిక్, అనిల్ దేశ్‌ముఖ్ పిటిషన్ల తిరస్కరణ

ముంబై: రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సమయం దగ్గర పడుతున్న వేళ మహారాష్ట్రలో అధికార కూటమికి చుక్కెదురైంది. ఎన్నికల్లో ఓటు వేసేందుకు గాను ఒకరోజు బెయిల్ ఇవ్వాలని మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్, రాష్ట్ర మంత్రి నవాబ్ మాలిక్ చేసిన విజ్ఞప్తిని ప్రత్యేక న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇద్దరు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. తాజా తీర్పుతో జైల్లో ఉన్న ఇద్దరు నేతలు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో 6 రాజ్యసభ స్థానాలకు గాను జూన్ 10న ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో మహావికాస్ అఘాడీ తరపున శివసేన రెండు, ఎన్‌సీపీ, కాంగ్రెస్‌లు ఒక్కో స్థానాల్లో పోటీకి సిద్ధమయ్యాయి. బీజేపీ కూడా మూడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. రాజ్యసభలో విజయం సాధించాలంటే ఒక్కో అభ్యర్థికి 42 మంది మద్దతు కావాల్సి ఉంది. అయితే, శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీలు ఒక్కోస్థానంలో గెలిచేందుకు కావాల్సిన బలం ఉంది. 106 సభ్యులున్న బీజేపీకి కూడా రెండుస్థానాలు తేలికగా గెలువగలదు. కేవలం ఆరో స్థానంలో మాత్రమే రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోరు జరుగనుంది. ఈ నేపథ్యంలోనే ఎన్‌సీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటు వేసేందుకు అవకాశం లభించకపోవడం మహావికాస్ అఘాడీకి సమస్యగా మారింది. ఇదిలాఉంటే, మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మహారాష్ట్ర మంత్రి నవాబ్ మాలిక్ ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జైల్లోనే ఉన్నారు. మరో కేసులో నిందితుడిగా ఉన్న మహారాష్ట్ర మాజీ హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ కూడా జైల్లోనే ఉన్న సంగతి తెలిసిందే.

పంజాబ్ ముఖ్యమంత్రి ఇంటి ముందు కాంగ్రెస్ ధర్నా

చండీగఢ్: ముఖ్యమంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్నా, తమకు కలవడానికి సీఎం ఒప్పుకోవడం లేదని ఆరోపిస్తూ పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరేందర్ సింగ్ రాజా వారింగ్, ఇతర నాయకులు గురువారం పంజాబ్ ముఖ్యమంత్రి ఇంటిముందు ధర్నా చేశారు. చండీగఢ్‌లోని సీఎం నివాసంలోకి తమను పిలిపించి, తనిఖీ చేసి తమ మొబైల్ ఫోన్లు కూడా లాక్కెళ్లారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు తాను సమయం ఇచ్చానన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ పార్టీ నాయకులకు మద్దతుగా వారు నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. మాజీ అటవీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు సాధు సింగ్ ధరమ్‌సోత్‌ను అరెస్టు చేయడం, అవినీతి కేసులో సంగత్ సింగ్ గిల్జియాన్ పేరు పెట్టడాన్ని మాన్ స్పష్టంగా ప్రస్తావించారు. రాష్ట్ర అసెంబ్లీలో వారింగ్, ప్రతిపక్ష నాయకుడు పర్తాప్ సింగ్ బజ్వాతో పాటు, మాజీ డిప్యూటీ సీఎంలు సుఖ్‌జిందర్ సింగ్ రంధావా, ఓ.పి. సోనీ, మాజీ మంత్రులు అరుణా చౌదరి, భరత్ భూషణ్ అషు నిరసనలో పాల్గొన్నారు.

మా అభ్యర్థికి ఓటేయండి

కాంగ్రెస్‌కు కుమారస్వామి విజ్ఞప్తి



బెంగళూరు: లౌకికశక్తులను బలోపేతం చేయడానికిగాను రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి మద్దతివ్వాల్సిందిగా కాంగ్రెస్ పార్టీకి జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి గురువారం విజ్ఞప్తి చేశారు. బీజేపీని ఓడించడానికి జేడీఎస్‌కు కాంగ్రెస్ మద్దతివ్వాల్సిందేనని గట్టిగా కోరారు. వాస్తవంగా కాంగ్రెస్ కన్నా తమ పార్టీకే ఎక్కువ ఓట్లు ఉన్నాయని మాజీ సీఎం కుమారస్వామి వరుస ట్వీట్ల ద్వారా వెల్లడించారు. 'రాజ్యసభ ఎన్నికల్లో తమ మొదటి అభ్యర్థిగా కుపేంద్రరెడ్డిని జేడీఎస్ రంగంలోకి దించింది. ఆయన పారిశ్రామికవేత్త, సామాజిక ఉద్యమకారుడు, ప్రగతిశీల భావజాలం కలవారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయనకు అనుభవం ఉంది. అన్ని పార్టీలు ఆయనకు మద్దతు ఇవ్వాల్సింన అవసరం ఉంది. లౌకికశక్తులను పటిష్టవంతం చేయడం కోసం కుపేంద్రరెడ్డికి కాంగ్రెస్ మద్దతివ్వాల్సిందే' అని కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగా భవిష్యత్‌ను చరిత్ర, ప్రజలు నిర్ణయిస్తారు. కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సూర్జేవాలా ఈ విషయాన్ని కచ్చితంగా అర్థం చేసుకుంటారని తాను భావిస్తున్నానని కుమారస్వామి పేర్కొన్నారు. కర్ణాటక నుంచి నాలుగో సీటుకు జరుగుతున్న పోటీ ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ సీటును బీజేపీకి దక్కకుండా చేయడానికి కాంగ్రెస్, జేడీఎస్ చేతులు కలపాల్సి ఉంది. అందులో భాగంగానే కుమారస్వామి కాంగ్రెస్ మద్దతు కోరుతున్నారు. ఈ సీటు కోసం ఇప్పటికే కాంగ్రెస్, జేడీఎస్ చర్చలు జరిపాయి. రెండు పార్టీలు తమ వైఖరులకే కట్టుబడి ఉండటంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. నాలుగో అభ్యర్థిని గెలిపించుకునే బలం కర్ణాటకలో బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్‌కు లేదు. ఏ రెండు పార్టీలు కలిసినా ఆ సీటు గెలుచుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఆత్మప్రబోధానుసారం ఓటేయండి

జేడీఎస్ ఎమ్మెల్యేలకు సిద్ధరామయ్య లేఖ

బెంగళూరు: రాజ్యసభ ఎన్నికల్లో ఆత్మప్రబోధానుసారం ఓటేయాల్సిందిగా జేడీఎస్ శాసనసభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేలకు గురువారం బహిరంగ లేఖ రాశారు. తమ పార్టీకి చెందిన రెండో అభ్యర్థి మన్సూర్ అలీఖాన్‌కు అనుకూలంగా ఓటు వేయాలని సూచించారు. అలీఖాన్ విజయం రెండు పార్టీలు అనుసరించే లౌకిక సిద్ధాంతం విజయానికి దోహదపడుతుందని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలకు సిద్ధరామయ్య లేఖ రాయడాన్ని జేడీఎస్ నేత కుమారస్వామి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంపై నామినేషన్లకు ముందే తమ పార్టీ నాయకులతో సంప్రదించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదేకాదని కుమారస్వామి పేర్కొన్నారు. మైనారిటీ అభ్యర్థికి మద్దతివ్వాలని సిద్ధరామయ్య లేఖ రాశారని, అలాంటప్పుడు మన్సూర్ అలీఖాన్‌ను మొదటి అభ్యర్థిగా కాకుండా జైరామ్ రమేశ్‌ను ఎందుకు ప్రకటించారని ఆయన ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి జేడీఎస్ బీ టీమ్ అని పదేపదే ప్రచారం చేసిన సిద్ధరామయ్య...ఆశ్చర్యకరంగా ఇప్పుడు లౌకిక పార్టీ అంటూ లేఖలో తెలిపారు. జేడీఎస్ అభ్యర్థి కుపేంద్రరెడ్డికి మద్దతివ్వాలని కుమారస్వామి విజ్ఞప్తి చేసిన వెంటనే సిద్ధరామయ్య లేఖ రాశారు. ఈ రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థి గెలుపు లౌకికవాదానికి జీవన్మరణ సమస్యగా ఉంది. సైద్ధాంతికంగా కాంగ్రెస్, జేడీఎస్ ఒకవైపున ఉండగా మతోన్మాదమే ఊపిరిగా బీజేపీ బతుకుతోంది. తమ రెండో అభ్యర్థి మన్సూర్ అలీఖాన్ గెలుపు, ఓటమి కోసం మైనారిటీలే కాకుండా లౌకికవాదులంతా ఆతృతగా, ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని సిద్ధరామయ్య తెలిపారు. అలీఖాన్ గెలుపు ఏ ఒక్క రాజకీయ పార్టీ విజయమో కాదని, లౌకికసిద్ధాంతం విజయమని స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధిగా ఆత్మప్రబోధానుసారం ఓటేయడం తమ కర్తవ్యమని, అందువల్ల లౌకికవాదానికి నిబద్ధుడైన అలీఖాన్‌కు ఓటేయాలని సిద్ధరామయ్య కోరారు.

నయనానందకరంగా విఘ్నేశ్-నయనతార పెళ్లి

చెన్నై: సౌత్ లేడీసూపర్ స్టార్ నయనతార, తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్ వివాహం జూన్ 9 మహాబలిపురంలో కన్నుల పండుగగా జరిగింది. ఈ వేడుకకు బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్, సూపర్ స్టార్ రజినీకాంత్, దర్శకుడు అట్లీ, అజిత్, బోనీకపూర్, విజయ్ సేతుపతి లాంటి తమిళ సినీ ప్రముఖులు హాజరయ్యారు. మహాబలిపురంలోని ఒక ప్రముఖ స్టార్ హోటల్‌లో వీరి వివాహం జరిగింది. ప్రస్తుతం వీరి పెళ్లి ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నయనతారను పెళ్లికూతురుగా చూస్తూ అభిమానులు తెగ మురిసిపోతున్నారు. నయన తార, విఘ్నేష్ ఇద్దరూ తమ వివాహ విషయాన్ని ప్రకటించినప్పటినుంచి అభిమానులు సోషల్ మీడియాలో తెగ హడావిడి చేశారు. అసలు ఒక వెడ్డింగ్ ఇన్విటేషన్‌నే క్రియేట్ చేసి సర్క్యులేట్ చేశారు కూడా. నిజంగా అది వారి పెళ్లి కార్డే అనేంతగా ఆ వివాహ ఆహ్వానపత్రిక సోషల్ మీడియాలో వైరల్ అయింది. నయనతార పెళ్లి వేడుక మొత్తానికి అత్యంత వైభవంగా జరగడంతో అభిమానుల ఆనందానికి అంతే లేకుండా పోయింది. నయనతార, విఘ్నేష్ దంపతులకు సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షల సందేశాలు అందుతున్నాయి.

మహేశ్‌కు జోడీగా మళ్లీ రశ్మిక ?

హైదరాబాద్: సూపర్‌స్టార్ మహేశ్‌బాబు ఇటీవల 'సర్కారువారి పాట' చిత్రంతో మంచి విజయం అందు కున్న సంగతి తెలిసిందే. తదుపరిగా అతడు నటించే సినిమాపై అభిమానులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా వచ్చేనెల్లోనే సెట్స్ పైకి వెళ్ళబోతోంది. ఎస్ఎస్ఎంబీ- 28గా పిలుచుకుం టోన్న ఈ సినిమా కోసం 'అర్జునుడు' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను రిజిస్టర్ చేసినట్టు ఇదివరకు వార్తలొచ్చాయి. గతంలో మహేశ్, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన 'అతడు, ఖలేజా' చిత్రాలు మంచి సక్సెస్ సాధించిన నేపథ్యంలో ఈ హ్యాట్రిక్ కాంబోపై భారీ అంచనాలు నెలకొన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్త నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కబోతోంది. ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నట్టు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'మహర్షి' చిత్రంలో మొట్ట మొదటి సారిగా మహేశ్ సరసన పూజా కథానాయికగా నటించింది. ఆ సినిమా సూపర్ హిట్టవడంతో పూజా ఈ సినిమాకి పాజిటివ్ సెంటిమెంట్‌గా మారింది. ఇదిలా ఉండగా.. ఎస్ఎస్ఎంబీ-28 పై తాజాగా ఓ వార్త సోషల్ మీడియాలో వినిపిస్తోంది. అదేంటంటే.. ఈ సినిమా కథానాయికగా ఇప్పుడు రశ్మికా మందన్న పేరు కూడా వినిపిస్తోంది. త్రివిక్రమ్‌కు ఇప్పటికే పూజా సెంటిమెంట్ ఉంది కాబట్టి.. ఆమెను ఈ సినిమా నుంచి తప్పించడం జరగనిపని. మరో కథానాయికగా రష్మికను ఎంపిక చేశారా? లేదా ? అన్న విషయంలో క్లారిటీ లేదు. రశ్మిక సైతం మహేశ్ బాబుతో 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో జోడీ కట్టిన సంగతి తెలిసిందే. ఆ సినిమా కూడా హిట్టవడంతో ఆమె విషయంలో కూడా మహేశ్ బాబుకు పాజిటివ్ సెంటిమెంట్ ఉంది.

లోకేశ్ కనగరాజ్‌కు రామ్‌చరణ్ గ్రీన్‌సిగ్నల్?

హైదరాబాద్: ఆర్ఆర్ఆర్, ఆచార్య సినిమాల తర్వాత రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తన 15వ చిత్రాన్ని చేస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్‌తో కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రాన్ని శరవేగంగా తెరకెక్కిస్తున్నారు. అంజలి, జయరామ్, నవీన్ చంద్ర, సునీల్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. అయితే, ఈ సినిమా తర్వాత చరణ్ నుంచి కూడా ఇంట్రెస్టింగ్ లైనప్ రెడీగా ఉంది. ఇప్పటికే, 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో చేయనున్న ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే, కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇదే వరుసలో ప్రశాంత్ నీల్‌తో పాటు మరికొందరు దర్శకులు కథలు సిద్ధం చేసుకొని చరణ్ కాల్ కోసం వెయిట్ చేస్తున్నారు. అయితే, ఈ లైనప్‌లో కోలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ లోకేష్ కనగ్‌రాజ్ కూడా చేరాడని తెలిసిందే. ఇంతకముందే చరణ్- లోకేష్ కలిసి ఓ పాన్ ఇండియా చిత్రాన్ని చేయబోతున్నారని వార్తలు వచ్చాయి. ఇప్పుడు దీనికి సంబంధించిన కథ రెడీ అవుతుందట. ఆర్సీ 15 కంప్లీట్ అయ్యేలోపు చరణ్‌కు కథ చెప్పడానికి ప్లాన్ చేసుకుంటున్నాడట లోకేష్. ఇటీవల వచ్చిన 'విక్రమ్' సినిమాతో కమల్ హాసన్‌కు భారీ హిట్ ఇచ్చాడు. నెక్ట్స్ సినిమాను 'తలపతి' విజయ్‌తో చేయబోతున్నాడు.

విద్య, ప్రజారోగ్యంపై రాజీ వద్దు

నీట్ పీజీ-21 కౌన్సెలింగ్‌పై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: నీట్-పీజీ-21 ఆలిండియా కోటా కౌన్సెలింగ్ నిర్వహణకు గడువు ఉండటం ముఖ్యమని సుప్రీంకోర్టు గురువారం అభిప్రాయపడింది. విద్య, ప్రజారోగ్యంపై రాజీ పడి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించలేమని పేర్కొంది. నీట్ పీజీ-21లో 1,456 సీట్ల భర్తీకిగాను ప్రత్యేక స్ట్రే రౌండు కౌన్సెలింగ్ కోరుతూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం రిజర్వులో పెట్టింది. ఇదే అంశమై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అనిరుద్ధా బోస్‌తో కూడిన వెకేషన్ ధర్మాసనం స్పందించింది. 'స్పెషల్ స్ట్రే రౌండ్లకు కాలపరిమితి ఉండాలి. చాలా ఏళ్లుగా ఖాళీలు భర్తీ కాలేదు. ఇలా జరగకపోవడం ఇది మొదటిసారి కాదు. ఈ మొత్తం ప్రక్రియకు నిర్దేశిత గడువు ఉండాలి. 8-9 రౌండ్ల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు ఖాళీగా ఉండటం వల్ల మూడేళ్ల కోర్సు కాలంలో ఒకటిన్నరేళ్ల తర్వాత మీకు ప్రవేశాలు కల్పిస్తా రంటున్నారా? విద్య, ప్రజారోగ్యం విషయంలో రాజీ పడమంటారా? ఇది మూడేళ్ల కోర్సు అయినందుకు సంతోషించండి' అంటూ విచార ణను ముగిస్తూ సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

అంతకుముందు కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బల్బీర్ సింగ్‌ను ద్దేశించి 'ఈ పిటిషన్లను విరోధి వ్యాజ్యాలుగా పరిగణించవద్దు, సాంకేతికతల జోలికి వెళ్లొద్దు. ఇది 1,400 మెడికల్ సీట్లకు సంబంధించిన వ్యవహారం. అవన్నీ పీజీ సీట్లు. ప్రభుత్వానికి వైద్యులు కావాలి. పీజీ డాక్టర్లు .. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు కావాలి. మనకు వైద్యుల కొరత ఉంది. వారు దేశానికి సేవ చేయగలరు. 1400 సీట్లు అంటే తక్కువేమీ కాదు' అని ధర్మాసనం పేర్కొంది. వెబ్‌సైట్ మూతబడింది కాబట్టి ఏమీ చేయలేమి అని ప్రభుత్వం చెప్పడం సరికాదని తెలిపింది. 'మాకు కేవలం విద్యార్థుల విషయంలోనే కాదు యావత్ దేశం విషయంలో ఆందోళన ఉంది. 1400 మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు దేశానికి లభిస్తారంటే అది ప్రజాశ్రేయస్సుకు సంబంధించిన అంశం. పోస్టులు ఖాళీగా ఉంటే తద్వారా వైద్య మండలికి లేదా ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం ఉంటుందో చెప్పండి. పోరాటం మానేసి పరిష్కారంపై దృష్టి పెట్టండి' అని ధర్మాసనం వెల్లడించింది. అయితే ఇది ప్రతి ఏటా జరిగే ప్రక్రియేనని, ఆయా స్థానాలు నాన్-క్లీనికల్‌వని, వాటి కోసం ఎవ్వరూ దరఖాస్తు చేయరని ఏఎస్‌జీ సింగ్ తెలిపారు. 2021లో ఖాళీగా ఉన్న 1,456 స్థానాల్లో 800/900 ఎంపికైనప్పటికీ విద్యార్థులు ఎవ్వరూ చేరలేదని అన్నారు. ఫిబ్రవరి నుంచి తరగతులు జరుగుతున్నాయని, ఇప్పుడు మరో ఆరు నుంచి ఎనిమిది నెలలు తరగతులు నిర్వహించడం కుదరదని చెప్పారు. ప్రస్తుతం కౌన్సెలింగ్ నిర్వహిస్తే 2022 నీట్ బోధనపైనా ప్రభావం ఉంటుందని తెలిపారు. కాగా, తొమ్మిది రౌండ్ల తర్వాత కౌన్సెలింగ్ ముగించినట్లు జాతీయ వైద్య మండలి తరపు న్యాయవాది గౌరవ్ శర్మ చెప్పారు. ప్రతి ఏటా సమస్య వస్తూనే ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం పరిష్కారం ఏమిటో ఆలోచించాలని, విద్య, ప్రజారోగ్యం రాజీ వద్దని పేర్కొంది.

టీ20 మ్యాచ్‌కు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఈనెల 14న జరగనున్న భారత్-దక్షిణాఫ్రికా టీ20 మ్యాచ్‌కు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. గురువారం స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ కె.రామ్మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ఏ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్, నగర మేయర్ హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ జి.లక్ష్మీశ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ ఎస్ ఆర్ గోపీనాథ్ రెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీఈవో శివారెడ్డి, విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్ రాజుతో పాటు క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఏర్పాట్లపై సమీక్షించారు. క్రీడాకారుల భద్రతతోపాటు క్రీడాభిమానులు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. పార్కింగ్‌తో పాటు ట్రాఫిక్ మళ్లింపు వంటి అం శాలపై చర్చించారు. ఇప్పటి వరకు 19 వేల టికెట్లు అమ్మకాలు జరిగినట్ల సమావేశంలో వెల్లడించారు. ఈ మ్యాచ్‌కు 100 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అభిమానుల నిరసనలపై కూడా కమిటీ చర్చించినట్లు తెలిసింది. రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్న ఈ మ్యాచ్‌కు మరోపక్క ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా విశాఖలో క్రికెట్ మ్యాచ్‌లు జరగకపోవడంతో క్రికెట్ క్రీడా అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

లక్ష్మణరేఖ దాటిన తెలంగాణ గవర్నర్

సీపీఐ నేత నారాయణ విమర్శ



హైదరాబాద్: తెలంగాణ గవర్నరు తమిళసై సౌందర్ రాజన్‌పై సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గవర్నరు లక్ష్మణరేఖ దాటుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానిం చారు. రాజ్‌భవన్‌ను రాజకీయ కార్యకలాపాలకు వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతు న్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. మహిళా దర్బార్ ఎందుకోసం నిర్వహిస్తున్నారని నారాయణ ప్రశ్నించారు. ఎవరైనా వినతిపత్రం ఇస్తే తీసుకొని... దానిని ప్రభుత్వానికి పంపవచ్చని, కానీ రాజ్‌భవన్‌ను రాజకీయాలకు వాడుకోవడం సరికాదని ఆయన హితవు పలికారు. గవర్నరు పాత్ర రాష్ట్రంలో అగ్గి రాజేస్తోందని నారాయణ తెలిపారు. గవర్నరు పాత్ర రాజకీయంగా ఉండటం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని విమర్శించారు. గవర్నరు తలపెట్టిన దర్బార్‌ను రద్దు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. ఓవైపున రాజకీయ దాడి పెంచిన గవర్నరు.. ప్రభు త్వంపై విధానపరంగానే పోరాటం చేస్తున్నారని మండిపడ్డారు.

అత్యాచార నిందితులకు ప్రభుత్వ పెద్దల అండ

తెలుగు రాష్ట్రాల్లో పెనుసంచలనం సృష్టించిన హైదరాబాద్ అమ్నీషియా పబ్ మైనర్ రేప్ కేసు నిందితులను ఏపీ, తెలంగాణ ప్రభుత్వ పెద్దలు కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని నారాయణ ఆరోపించారు. మైనర్ బాలికపై అత్యాచారానికి కారణమైన పబ్ నిర్వాహకులపై కేసులు ఎందుకు పెట్టలేదని, ఆ పబ్‌ను ఎందుకు మూసివేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 18 ఏళ్లలోపు వయసున్న వారిని పబ్‌లోకి అనుమతిం చడం నేరం కాదా అని నిలదీశారు. అత్యాచారం కేసులో ఏపీ సలహాదారు కుమారుడు, తెలంగాణ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కొడుకు, హోంమంత్రి మనవడు సహా బడాబాబుల పిల్లలున్నందున టీఆర్ఎస్ ప్రభుత్వం, వైసీపీ ప్రభుత్వం తమ వారిని కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. సీఎం జగన్ తక్షణమే తన ప్రభుత్వంలో సలహాదారుగా ఉన్న ఆ వ్యక్తిని తొలగించాలని, కేసీఆర్ కూడా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండు చేశారు. పదవుల నుంచి దిగిపోవడానికి నిరాకరిస్తే ప్రభుత్వమే వారిని డిస్మిస్ చేసినట్టు ప్రకటించాలని సూచించారు. ఇవన్నీ చేయకుండా నిందితులను కాపాడేందుకు సీపీ ఆనంద్ వంటి వారిని ఉపయోగించుకుం టున్నారని ఆరోపించారు. గతంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న కోనేరు రంగారావు మనవడిని కాపాడిన పోలీసులు ఇప్పుడు హోంమంత్రి మనవడిని కాపాడుతున్నారని గురువారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో వ్యాఖ్యానించారు. ఇటువంటి వారు అధికారులుగా ఉంటే న్యాయం జరగదన్నారు. ప్రభుత్వాలు నిందితులను కాపాడే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలంటే అత్యాచార ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండు చేశారు.

మహిళా సాధికారతకు కేంద్రం పెద్దపీట

- పిల్లల ఆలనాపాలనా మా బాధ్యతే
- కేంద్రమంత్రి మహేంద్రభాయ్ ముంజపరా

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మహిళలు, పిల్లలను ప్రోత్సహిం చడం, రక్షించడం, సాధికారత కల్పిం చడం కోసం 8 ఏళ్లుగా అవిశ్రాంతంగా, నిబద్ధతతో కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ సహాయమంత్రి డా. మహేంద్రభాయ్ ముంజపరా అన్నారు. విశాఖపట్నంలో గురువారం ఆశావాహ జిల్లాలపై సౌత్ జోనల్ సమావేశం జరిగింది. మంత్రి ముంజపరా మాట్లాడుతూ హింస, వేధింపుల నుండి బాలికలు, మహిళల రక్షణకు కృషి చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ నుంచి ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. 2015 నుంచి దేశవ్యాప్తంగా 708 'వన్ స్టాప్ సెంటర్లు' అందుబాటులోకి వచ్చాయని, లింగ ఆధారిత హింస నుంచి బయటపడిన వారికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. 5.2 లక్షల మంది మహిళలకు ఈ వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా మద్దతు లభించిందని ఆయన తెలిపారు. ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు 2 లక్షల గ్రోత్ మానిటరింగ్ పరికరాలు, 11 లక్షలకు పైగా స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం రూపొం దించిన పోషణ ట్రాకర్ ద్వారా పాలనను మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించడానికి, చికిత్స చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 12 లక్షలకుపైగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు ఉన్నాయని, 11 లక్షలకు పైగా కేంద్రాల్లో మరుగుదొడ్లు ఉన్నాయని, మిగిలిన అన్ని అంగన్వాడీల్లో మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ఉద్యమాలకు కేంద్ర బిందువు ఎస్టీయూ

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, తిమ్మన్న
- ఘనంగా 76వ వ్యవస్థాపక దినోత్సవం
- విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కార ఉద్యమాలకు కేంద్ర బిందువుగా రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నిలుస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తెలిపారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఎస్టీయూ, 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విజయవాడ హనుమాన్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపకులు మగ్దూం మొహియుద్దీన్ చిత్రపటానికి పూలమాలేసి నివాళు లర్పించారు. హనుమాన్‌పేట ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నేతలు మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం స్వాతంత్ర్యానికి పూర్వమే 9 జూన్ 1946లో ఆనాటి హైదరాబాద్ నిజాం పాలన నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిందని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా, సంఘ వ్యవస్థాపకులు మగ్దూం మొహియుద్దీన్ రాష్ట్రోపాధ్యాయ సంఘాన్ని స్థాపించారని, గత 75ఏళ్లుగా వీణా విజయ రామరాజు, దంతులూరి సత్యనారాయణరాజు, సలాంఖాన్, పీవీ రాఘవాచారి, శ్యామ సుందర్‌రావు, సరేంద్రరెడ్డి తదితరులతో పాటు ఎంతోమంది ఉపాధ్యాయ నాయకులను తయారు చేసిందన్నారు. వీణా విజయరామ రాజు, పోచంరెడ్డి సుబ్బారెడ్డి, కత్తి నరసింహారెడ్డి తదితరులు ఎమ్మెల్సీలుగా శాసనమండలిలో అందించిన సేవలు రాష్ట్రోపాధ్యాయ సంఘానికే చెందుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన చాలా సమస్యలు పరిష్కరించి, పెన్షన్ లేని దశనుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు నిర్వహించిందనీ, ఫలితంగానే నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు ప్రతి ఐదేళ్లకు పీఆర్సీ, గ్రాట్యూటీ, భవిష్య నిధి, ఆరోగ్యకార్డులు, కుటుంబ పెన్షన్, పారదర్శక బదిలీలు, పదోన్నతులు తదితర సౌకర్యాలు సాధ్యమయ్యా యని పేర్కొన్నారు. ఒకవైపు పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతూనే, మరో వైపు సమాజ సేవా కార్యక్రమాల్లోనూ ఎస్టీయూ ముందుందని తెలిపారు. అనంతరం ఎస్టీయూ అందిస్తున్న సేవలను విజయవాడ ప్రభుత్వాస్పత్రి ప్రాంతీయ వైద్యాధికారి (ఆర్ఎంఓ) రోశయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ ప్రసాద్, కృష్ణాజిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండవ శ్రీనివాస్, సీహెచ్.ఆర్‌వీఎస్ సురేష్‌కుమార్, విజయవాడ నగర శాఖ నాయకులు ఎస్.మస్తాన్ రావు, శిరంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరుడు లేని పెళ్లి

వడోదర: తనను తానే పెళ్లి చేసుకుంటానని చెప్పిన 24 ఏళ్ల క్షమా బిందు ఆ ఘట్టాన్ని పూర్తి చేసింది. తనను తానే పెళ్లాడేసుకుంది. ముహూర్తాని కన్నా రెండు రోజుల ముందే మను వాడేసింది. నిజానికి ఆమె జూన్ 11వ తేదీని పెళ్లి చేసుకోవాలనుకున్నది. కానీ 9వ తేదీనే ఆ తంతును ముగించేసింది. అయితే పెళ్లిలో భాగంగా జరిగే అన్ని వేడుకల్ని ఆమె నిర్వహిం చింది. హల్దీ, మెహిందీ లాంటి సంప్ర దాయ పెళ్లి వేడుకల్ని తన ఫ్రెండ్స్, ఫ్యామిలీతో జరుపు కుంది. 40 నిమిషాల పాటు పెళ్లి తతంగం జరిగింది. పెళ్లి కుమారుడు లేకుండానే ఈ వేడుక జరగడం ప్రత్యేకం. గుజరాత్‌లో సోలో గమీ పెళ్లి చేసుకున్న తొలి యువతిగా బిందు నిలిచింది. ఈ పెళ్లికి పూజారులు కూడా లేరు. తనను తానే పెళ్లి చేసుకోవడంపై ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఇతర పెళ్లి కూతుళ్ల తరహాలో తనకు అప్పగింతలు అంటూ ఏమీ లేవని చెప్పింది. పెళ్లికి సంబం ధించిన ఫొటోలను తన ఇన్‌స్టాలో పోస్టు చేసింది. తనకు తనతోనే పవిత్ర బంధం ఏర్పడినట్లు హల్దీ వేడుక ఫొటోలకు ట్యాగ్‌లైన్ జోడించింది. రెండు వారాల పాటు గోవాకు హనీమూన్ ట్రిప్ వెళ్లేందుకు బిందు పేరెంట్స్ అనుమతి ఇచ్చారు.

పీఆర్సీ జీవోలతో ఆర్టీసీ ఉద్యోగులకు నష్టం

- లోపాలపై మార్పులు, చేర్పులు చేయాలి
- ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఉద్యమ కార్యాచరణ
- 13, 14 తేదీల్లో డిపోలు, వర్క్‌షాపుల వద్ద నిరసనలు
- సీఎం జగన్‌కు, సీఎస్, ఆర్టీసీ ఉన్నతాధికారులకు లేఖలు
- ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం జారీచేసిన పీఆర్సీ జీవోలతో ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వాటి లోపాలు మార్పులు, చేర్పులు చేయాలని డిమాండు చేస్తూ, ఈనెల 13, 14 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 129 డిపోలు, వర్క్‌షాపులు, కార్యాలయాల వద్ద ఎర్ర బ్యాడ్జీలతో నిరసనలు, ధర్నాలు, గేట్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక వెల్లడించింది. గురు వారం విజయవాడ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్.సుందరయ్య, వైఎస్ రావు, జేఏసీ నాయకులు పీవీ రమణారెడ్డి, వైవీ రావు తదితరులు సమావేశమయ్యారు. అనంతరం జీవోలతో ఉద్యోగులకు కలుగుతున్న నష్టాలు, బదిలలతో వచ్చే ఇబ్బందులు తదితర వివరాలతో సీఎం జగన్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ఉన్నతాధి కారులకు నేతలు లేఖలు పంపారు. పీఆర్సీ చైర్మన్ మిశ్రా ఇచ్చిన నివేదిక ప్రకారం 6.3శాతం అదనపు ఫిట్‌మెంటు ఇవ్వకుండా ప్రభుత్వం ప్రకటించిన కరవుభత్యం 4.7శాతంలో 1.6శాతం డీఏ తగ్గిస్తూ, జీవోలు ఇవ్వడం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. ఆయా జీవోలు మార్పు చేయాలని డిమాండు చేస్తూ, ఈనెల 13, 14 తేదీల్లో 26జిల్లాల్లోని 129 ఆర్టీసీ డిపో యూనిట్లు, వర్క్‌షాపుల వద్ద భోజన విరామ సమయంలో నిరసన గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల బలవంతపు బదిలీ ఆదేశాలను నిలుపుదల చేయాలని ఆ లేఖల్లో కోరారు. ఆర్టీసీ ఉద్యోగులంతా వేతనాల పెంపుతో జీవోలు వస్తాయని ఎదురు చూసినప్పటికీ, ప్రభుత్వం స్పందిం చలేదన్నారు. పీఆర్సీ చైర్మన్ మిశ్రా నివేదిక ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన తాత్కాలిక ఫిట్‌మెంట్ 25శాతానికి కలిపి ఇవ్వకపోగా, 3.1శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేలా జీవోలు జారీ చేయడం తగదన్నారు. ప్రస్తుతం ఇచ్చిన జీవోలలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ తదితర విభాగాల ఉద్యోగులకు వేతనాలపై జరిగిన నష్టాన్ని సరిచేయా లని డిమాండు చేశారు. వర్క్‌షాపు, ఇతర విభాగాల సిబ్బంది అలవెన్సులలో నష్టం కలిగించే విధానాలను మార్పు చేయాల న్నారు. బదిలీలపై ఎవ్వరూ ఆప్షన్లు ఇవ్వొద్దని సూచించారు. తొలగించిన అలవెన్సులు పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ నాయకులు అధికారులకు లేఖలు ఇచ్చారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇవ్వాలి: రవీంద్రనాథ్

ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్సీకి నష్టం కలిగించే జీవోలు (113, 114) జీవోలను రద్దు చేసి, వారికి న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పీఆర్సీపై ప్రభుత్వ ఉద్యోగులకు తరహాగా ఆర్టీసీ ఉద్యోగులకూ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వంలో విలీనం వల్ల నష్టపోయామని ఆలోచనతో కార్మికులున్నారని, విలీనంతో ఒక పీఆర్సీ నష్టపోయారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం 25శాతం శాతం ఫిట్మెంట్ ఇస్తే, జగన్ ప్రభుత్వం 23శాతమే ఇచ్చిందనీ, డీఏలూ తగ్గించిందన్నారు. పదోన్నతులు ఇతర అన్ని అంశాల్లోనూ కార్మికులు నష్టపోయారని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనంతో చాలా ప్రయోజనాలుంటాయని ఆశించిన కార్మికవర్గానికి, ఈ ప్రభుత్వ విధానాలతో తీవ్రంగా నష్టం జరుగుతోందన్నారు. ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన ప్రత్యక్ష కార్యాచరణకు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని రవీంద్రనాథ్ తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.